# ఈ రోడ్డు అంతా గుంతల మయం

**సుండుపల్లె, మార్చి08, ప్రభాతవార్త:**



మేజర్ గ్రామపంచాయతి దారిలో ప్రయాణం చేసేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుండి పెద్ద బలిజపల్లి, సామిసేని గడ్డ కు వెళ్లే రహదారి గుంతల మయం అయ్యి వాహనదారులు ప్రతిరోజూ చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రహదారిలో 5 గ్రామాల ప్రజలు నిరంతరం రాకపోకలు సాగిస్తున్నారు. ప్రతి రోజూ ఈ రహదారిలో స్కూల్ బస్సులు, ఆటోలు మరియు ద్విచక్ర వాహనాలు అధికంగా తిరుగుతూ ఉంటాయి. ఇక వర్షం పడితే వర్షపు నీరు ఆ గుంతలలో నిల్వ ఉండి కనీసం నడిచి వెళ్లడానికి కూడా వీలు లేకుండా చాలా ఇబ్బందిగా ఉందని ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంత మంది రాజకీయ నాయకులకు, అధికారులకు తెలియజేసిన ఈ రహదారి సమస్యను పట్టించుకునే వారే లేరని వాపోయారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని వాహనదారులు, ఆ గ్రామల ప్రజలు కోరుతున్నారు.


# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఆదివారం 09 మార్చి 2025


# వైభవంగా నరసింహ స్వామికి పూజలు

**గోపవరం ,మార్చి 8 ప్రభాతవార్త**



వల్లేరవారి పల్లె గ్రామంలో వెలిసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నందు ఫాల్గుణ మాసం ఆరంభంతో రెండవ శనివారం స్వామివారికి అంగరంగ వైభవంగా ప్రత్యేక పూజభిషేకాలు నిర్వహించారు. వీడియో కాల్ ద్వారా స్వామి కార్యక్రమాన్ని దేశ విదేశాలలో ఉన్న భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమానికి విచ్చేసిన భక్తులు మాట్లాడుతూ స్వామి వారిని దర్శించుకోవడం వలన దీర్ఘ కాలిక వ్యాధులు తొలిగిపోతు ఉన్నాయి అని, ఆలయంలో అంత కూడా గోవింద నామముతో, స్వామిని స్మరిస్తూ ఉండటం వలన ప్రశాంతత మనశాంతి ఉంటుంది అని తెలియజేశారు. స్వామివారిని దర్శించుట కొరకు ఇతర గ్రామాల నుంచి కాక జిల్లా నలుమూల నుంచి వచ్చి స్వామి వారిని దర్శించుకుని వారి కోర్కెలు నెరవేరిన తర్వాత మొక్కులను తీర్చుకుంటున్నారు,అందులో భాగంగా మణ్యం. రవీంద్రారెడ్డి, సతీమణి పద్మావతి లు స్వామి వారికి వెండి తీర్థం గిన్నెను స్వామివారికి కైంకర్యం చేయడం జరిగినది,అన్నదాన కైంకర్యం నిర్వహించిన వారు నల్లబోతుల వెంకటసుబ్బయ్య , శైలజలు ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు ప్రజలు పెద్దలు పాల్గొనడం జరిగినది.

# మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం...







**కడప మార్చి, 8: ప్రభాతవార్త**

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర బిసి సంక్షేమం, జిల్లా ఇంఛార్జి మంత్రి ఎస్. సవిత అన్నారు. శనివారం స్థానిక సాయి శ్రీనివాస్ గార్డెన్స్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం అతి ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి సవిత మాట్లాడుతూ స్త్రీలు ఎక్కడ గౌరవించబడుతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారు అని నమ్మిన సమాజం మనది. ఒక పురుషుడి విజయం వెనుక తల్లిలా, తోబుట్టువులా, భార్యలా ఓ స్త్రీ మూర్తి ఎప్పుడూ ఉంటుందన్నారు. ఓ సమాజం ఉన్నతంగా ఉందన్నా...ఓ కుటుంబం మంచిగా ఉందన్నా...అందుకు కారణం స్త్రీమూర్తే అని తెలిపారు. పురుషులతో సమానంగా ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లోనూ సత్తా చాటుతున్నారని, క్రీడలు, శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకు పోతున్నారన్నారు.వ్యాపార రంగాల్లోనే కాదు సమాజ సేవలోనూ, రాజకీయ రంగంలోనూ మహిళలు తమదైన ముద్ర వేస్తున్నారన్నారు. ప్రపంచాన్ని పాలించే శక్తి కలిగిన స్త్రీ మూర్తులు సమాజాంలోని కొన్ని అవలక్షణాల కారణంగా తీవ్ర వివక్షకు గురవుతున్నారు. మహిళలు వంట గదులకే పరిమితమవుతున్న వేళ...ఓ మహానీయుడు పుట్టుకొచ్చాడు..ఆయనే అన్న ఎన్టీఆర్..సమాజమే దేవాలయం...ప్రజలే దేవుళ్లు అంటూ...నినదించారన్నారు. మహిళలతోనే మెరుగైన సమాజం సాధ్యమని భావించి రాజ్యాధికారంలో భాగస్వామ్యం చేశాడు ఆస్తిలో మహిళలకు సగం వాటా కల్పించాడు ఎన్టీఆర్ చొరవతో వంట గదులకే పరిమితమైన మహిళలు చట్ట సభల్లో ఆశీనులయ్యారు. సమాజాభివృద్ధికి మెరుగైన శాసనాలు చేశారు. ఈ ఏడాది లక్షమంది మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దనున్నామన్నారు. లక్ష మందికి పైగా మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్నామన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి భావించి ద్వాక్రా సంఘాలను స్థాపించి ..నేడు వారిని లక్షాధికారులను చేశారన్నారు. అనంతపురం జిల్లా పెనుకొండ కు ఎమ్మెల్యే కావాలని మా అమ్మ కోరిక అని..ఎన్నో అడ్డంకులను అధికమించి నేడు మంత్రి స్థాయికి ఎదగగలిగానని మంత్రి అన్నారు. ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హాజరైన మహిళలతో పాటు జిల్లాలో ఉన్న మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు

జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ మహిళా మూర్తులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియచేశారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందడలో మనం 5వ స్థానంలో ఉన్నాం. ఈ సంవత్సరంలో మరింత వేగంగా అభివృద్ధి చెందాలని పెద్దలు నిర్ణయించి ఈ సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. గతంలో మాదిరిగా వంటింటికే పరిమితం కాకుండా నేడు మహిళలు ముందుకు వచ్చి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నారు. అన్ని కార్పొరేషన్ల ద్వారా రుణాలు మహిళల అభివృద్ధికి మంజూరు చేస్తున్నాం. గతంలో రూ.600 కోట్ల నుండి 650 కోట్లు రుణాలు ఇచ్చేవారం. అయితే ప్రస్తుతం బ్యాంకుల ద్వారా రూ 1500 కోట్ల రుణాలు ఇస్తున్నాం ఇది మహిళల అభివృద్ధికి నిదర్శనం అన్నారు. ఎంతో ఆర్థికంగా అభివృద్ధి చెందినా ఆడబిడ్డలను ఇంకా సమాజంలో చిన్నచూపు చూడడం సరికాదన్నారు. ప్రపంచం అభివృద్ధి చెందుతుందంటే ..మహిళలు ఆత్మస్థైర్యంతో ధైర్యంగా ముందుకు వెళ్తూ..అభివృద్ధిలో భాగం అవుతున్నారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదన్నారు.

జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ మాట్లాడుతూ ఎంతోమంది మహిళా మహిణీయులు ఉన్నారని వారందరిని స్ఫూర్తిగా తీసుకొని ఎదగాలన్నారు. మహిళలకు అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. మహిళలు పురుషుల కంటే తెలివిగా ఉంటారన్నారు. ప్రభుత్వం మహిళ రక్షణకు అనేక చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు.

జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ మాట్లాడుతూ మహిళలు మహిళ స్వావలంబన స్వయంగా సాధించుకోవాలని అన్నారు. మహిళ అభివృద్ధి కి ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టాడం జరిగిందని వాటిని వినియోగించుకొని సామాజికంగా, ఆర్థికంగా సమాజంలో ఎదగాలన్నారు. మహిళలకు పురుషులతో పాటు సమాన హక్కులు రావాలని అన్నారు. మహిళకు విద్య ఎంతో అవసరమని, అవకాశాలు కల్పిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించగలదన్నారు.

కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి రెడ్డి మాట్లాడుతూ మహిళలు బహుముఖ ప్రజ్ఞాశాలులని అన్ని పనులు చేసుకోగలరని అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 2027 విజన్ తో పని చేస్తూ మహిళా సాధికారత కు అహర్నిశలు కృషి చేస్తూనారన్నారు. మహిళా అభివృద్ధి కొరకు ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి మహిళలకు అవకాశం కల్పించడం జరుగుతోందని అన్నారు. మహిళలకు ఎన్ని సమస్యలు ఉన్నా వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని, బలహీనతను బలంగా మార్చుకోవాలని అన్నారు. టిడిపి అధ్యక్షులు, పొలిట్ బ్యూరో శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ మహిళలు ధైర్యంగా ముందుకు వెళ్లి అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. మహిళలకు ప్రస్తుతం 33 శాతం రిజర్వేషన్ ఉందని దానిని 50 శాతం వచ్చి చట్ట సభల్లో రాణించాలన్నారు. విద్య వల్లే మహిళా సాధికారత సాధ్యమని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 983 స్వయం సహాయక సంఘాలలోని 9830 మంది సభ్యులకు "బ్యాంకు లింకేజీ " రుణాలు రూ. 105 కోట్ల 59 లక్షలు, 69 మంది ఎస్సి ఎస్ హెచ్ జి లబ్దిదారులకు ఎస్సి కార్పొరేషన్ సబ్సిడీతో కూడిన సెర్ఫ్ ఉన్నతి వడ్డీలేని రుణాలు రూ. 1 కోటి, 8 లక్షల, 50 వేలు, పి ఎం విశ్వకర్మ యోజన క్రింద 542 మంది మహిళా చేతి వృత్తి పనివారికి బ్యాంకు రుణాలు రూ. 3 కోట్ల, ఏడు లక్షలు, నలుగురు ఉత్తమ మహిళా పారిశ్రామిక వేత్తలకు "ప్రేరణ సఖి"ల క్రింద ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతి రూ.2 లక్షలు మెగా చెక్కులను రాష్ట్ర బిసి సంక్షేమం, జిల్లా ఇంఛార్జి మంత్రి ఎస్. సవిత చేతుల మీదుగా లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్, డీఆర్డీఏ, మెప్మా పిడీలు శ్రీలక్ష్మి, ఆనంద్‌నాయక్, కిరణ్‌కుమార్, ఎస్సి కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, పలువురు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంచలనంగా మారిన మాజీమంత్రి వివేకా వాచ్ మెన్ మృతి



రంగన్న సమాధి వద్ద పోస్ట్ మార్టం జరుగుతున్న దృశ్యం



రంగన్న మృత దేహం నుంచి సేకరించిన ఆర్గాన్ లు కలిగిన పెట్టె

**పులివెందుల,మార్చి8,ప్రభాత వార్త:**

రాష్ట్ర వ్యాప్తంగా మాజీ మంత్రి వైయస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ప్రత్యక్ష సాక్షి రంగన్న మృతి సంచలనం కలిగిస్తోంది. వాచ్ మెన్ రంగన్న మృతితో అనుమా నాలు ఉన్నాయని రంగన్న భార్య సుశీలమ్మ ఫిర్యాదు తో సిఆర్‌పిసి 170 సెక్షన్ కేసు నమోదు పులివెందుల పోలీసులు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు లో జరుగుతున్న పరిణామాలు రంగన్న మృతిపై ఏపీ మంత్రివర్గం డిజిపిని పిలిచి వివరణ అడిగి తెలుసు కున్నారు. అలాగే ఈ కేసు దర్యాప్తు చేయడానికి ప్రత్యేక సిటీ ఏర్పాటు చేసి నిజాలు వెలికి తీసి నిందితులకు శిక్ష పడేలా చూడాలని మంత్రి వర్గం రాష్ట్ర డిజిపిని ఆదేశించింది. దీనితో డిజిపి హరీష్ కుమార్ గుప్తా వాచ్ మెన్ రంగన్న మృతిపై సమగ్ర విచారణ, కేసును దర్యాప్తు చేయడానికి సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేటివ్ టీం) ఏర్పాటు ఏర్పాటు చేసి అత్యంత అనుమానాస్పద మృతిగా అనుమానిస్తూ ఆ కోణంలో ను, ముద్దాయిల ప్రమేయం ఏమన్నా ఉందా అన్న కోణంలో ను, సైంటిఫిక్ యాంగిల్ లో ను దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా శనివారం పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాల సమీపంలో స్మశానం నందు వున్న సమాధి నుంచి రంగన్న మృతదేహాన్ని వెలికి తీసి పులివెందుల ఎమ్మార్వో మహమ్మద్ నజీర్ మరియు వీఆర్వోల ఆధ్వర్యంలో సిట్ బృందం అధికారులు అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, ఐఒ సీఐ ఉల్లసయ్య, జమ్మలమడుగు డిఎస్పి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో మంగళగిరి ఫోరెన్సిక్ నిపుణుల వైద్య బృందం డాక్టర్ మోనిక,డాక్టర్ దినేష్ ,తిరుపతి నుంచి ఎఫ్ఎస్ఎల్ టీం ముగ్గురు కడప నుంచి ముగ్గురు డాక్టర్లతో 8 మందితో కూడిన బృందం రంగన్న మృతదేహం నుంచి ఆర్గానిక్ ను సేకరించి ముద్ద దేహాన్ని పుచ్చు వేశారు. సేకరించిన ఆర్గానిక్ లను మంగళగిరి లోని ఫోరెన్సిక్ ల్యాబ్ కు తరలించారు. అత్యాధునిక పరికరాలతో నిపుణులైన వైద్యుల చేత సేకరించిన ఆర్గానిక్ లకు పరీక్ష చేసి సిట్ అధికారులకు నివేదిక ఇవ్వనున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐలు నరసింహులు, హాజీవల్లి, 4 ఎస్సైలు 10 స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ లు భద్రత నిర్వహించారు.

# అనుమానాస్పద స్థితిలో బీఫార్మసీ విద్యార్థిని మృతి

### చెరువులో తేలియాడిన మృతదేహం

**మదనపల్లెక్రైమ్, మార్చ్ 8 ప్రభాతవార్త.**



అనుమానాస్పద స్థితిలో బీఫార్మసీ చదువుతున్న విద్యార్థిని మృతి చెందింది. శనివారం మదనపల్లె మండలం, సిటియం రోడ్డులోని తట్టివారిపల్లి చెరువులో మృతదేహం తేలియాడడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు తాలూకా సిఐ కళా వెంకటరమణ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వెలికి తీసి వివరాలు సేకరించారు. సీఐ కథనం మేరకు.. పీలేరు పట్టణం సమీపంలోని బాలంవారిపల్లికి చెందిన ఎం.టి భాస్కర్ కుమార్తె పూజిత (24) మదనపల్లె మండలం, గంగన్నవారిపల్లె వద్ద ఉన్న కృష్ణ చైతన్య నర్సింగ్ కళాశాల నందు బీఫార్మసీ మూడవ సంవత్సరం చదువుతోంది. ఈ విద్యార్థిని మదనపల్లి పట్టణంలోని ప్రశాంత్ నగర్ లోని బాలాజీ పీజీ హాస్టల్లో ఉంటూ రోజు కళాశాలకు వెళ్లి వచ్చేది. ఈ క్రమంలో ఏం జరిగిందో ఏమో కానీ శనివారం చెరువులో మృతదేహమై కనబడింది. పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బీఫార్మసీ చదువుతున్న విద్యార్థిని మృతి కి కారణాలు తెలియ రాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# పాలవ్యాన్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

### .. ఇద్దరు డ్రైవర్లు దుర్మరణం

**పీలేరు, కె.వి పల్లి మార్చి 8 ప్రభాతవార్త:**





మృతులు ఢిల్లీ బాబు, వెంకటేష్‌ల దాచిన చిత్రాలు

పీలేరుకడప జాతీయ రహదారిపై పాల వ్యాన్ ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు దుర్మరణం చెందిన సంఘటన అన్నమయ్య జిల్లాలో చోటుచేసుకుంది. పీలేరు నియోజకవర్గంలోని కెవి పల్లి మండలం, మహల్ క్రాస్ వద్ద శనివారం వేకువ జామున చోటు చేసుకున్న ఘటనా వివరాలు పోలీసుల కథనం మేరకు.... ఇలా ఉన్నాయి. పూతలపట్టులోని తేజస్ పాల కేంద్రం నుంచి ఏజెంట్లకు పాల ప్యాకెట్లు సరఫరా చేయడానికి బయలుదేరి వచ్చిన టాటా ఏసీ పాల వ్యాన్ ను మహల్ క్రాస్ వద్ద ఓ మలుపులో రాయచోటి నుంచి చెన్నై వెళుతున్న ఏపీఎస్ఆర్టీసీ బస్సు మరో వాహనాన్ని ఓవర్ టెక్ చేస్తూ ఎదురుగా వచ్చిన పాల వ్యాన్ ను వేగంగా ఢీకొందని తెలిసింది. ఈ ఘటనలో అన్నమయ్య జిల్లా, రామాపురం మండలం, నీలకంతరావుపేటకు చెందిన శ్రీరాములు కుమారుడు పి. వెంకటేష్ (22), చిత్తూరు జిల్లా గుడిపాలకు చెందిన డి. ఢిల్లీ బాబు (32) అనే ఇద్దరు డ్రైవర్లు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. సమాచారం అందుకున్న కెవి పల్లి పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు పూర్వపరాలు విచారించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వి. చిన్న రెడ్డప్ప తెలిపారు. అనంతరం ఇరువురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి చేరుకుని బోరున విలపించసాగారు. మృతుడు ఢిల్లీ బాబుకు వివాహమై భార్య సంగీత, 9 ఏళ్ల పాప ధనుశ్రీ, ఆరేళ్ల బాబు జశ్వంత్ ఉన్నారు. ఇది ఇలా ఉండగా మరో మృతుడు వెంకటేష్ మెడలోని అత్యంత ఖరీదైన బంగారు గొలుసు, వేలి ఉంగరం, బంగారు చెవిపోగు, జేబులోని పర్సు మాయం అయ్యాయని, మృతుడి జేబులో ఐఫోన్ తో పాటు మరో ఫోన్ మాత్రమే ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారని మృతుడి బంధువులు చర్చించుకోవడం గమనార్హం.



రోధిస్తున్న తల్లి పక్కన అమాయక చిన్నారులు

# చౌక బారు నీచరాజకీయాలతో కాలయాపన

**వేంపల్లి, మార్చి 08, ప్రభాతవార్త :**



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో చౌకబారు రాజకీయాలతో కాలయాపన చేస్తున్నారని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట సతీష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలోని ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వ్యక్తి చనిపోతే ఆ వ్యక్తిని కూడా చిల్లర రాజకీయం కోసం 45 నిమిషాలు పాటు క్యాబినెట్ సమావేశంలో మాట్లాడారంటే మీ స్థాయి ఎటువంటిదో ప్రజలందరికి అర్థం అవుతుందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఒక గొప్ప మిషనరీగా ప్రాజెక్టు చేయబడ్డావని దేశమంతా కూడా ఎదురు చూస్తున్నటువంటి రోజులు ఉన్నాయని చెప్పి అందరూ చెప్పుకునే వాళ్ళు అయితే ఎక్కడికి పోయిందన్నారు. నీ పరిపాలన దక్షితని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఎటువంటి అవినీతి జరగకుండా ప్రతి సామాన్య ప్రజలకు సంక్షేమ పథకాలు డైరెక్ట్ గా అందజేసినటువంటి గొప్ప నాయకుడు అన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా రూ 2.80 వేల కోట్లు ప్రజల ఖాతాలో జమ చేశారన్నారు. రాష్ట్రానికి 750 మెడికల్ కాలేజీ సీట్లు తీసుకుని వస్తే వాటిని వద్దని వెనక్కి రాసిన ఇచ్చిన దౌర్భాగ్య ప్రభుత్వం తెదేపా ది కాదా అన్నారు. అలాగే మెడికల్ కళాశాలలు ప్రయివేటు వ్యక్తులకు అప్పగించి వ్యాపారం చేయడం ఇంత కన్నా దౌర్భాగ్య కూటమి ప్రభుత్వానిది కాదా అని విమర్శించారు. సామాన్య విద్యార్థులకు ఉన్నత విద్య అభ్యసించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ కళాశాలను మంజూరు చేస్తే వాటికి నిధులు ఇచ్చుకోలేక పేద విద్యార్థులపైనే ఆర్థిక భారం పెట్టడం ఎంత వరకు సమంజసమని చెప్పారు. ప్రతి కార్యక్రమంలోను కమీషన్లు వచ్చేది వాస్తవం కాదా అన్నారు. మాజీ మంత్రి వై.ఎస్.వివేకా హత్య కేసులో జగన్ సతీమణి భారతి, నారాయణ యాదవ్ తో పాటు చనిపోయిన డాక్టర్ ఈసి గంగిరెడ్డి, వై.ఎస్.అభిషేక్ రెడ్డి పేర్లను చేర్చిన విష సంస్కృతి చంద్రబాబుది అన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు పథకం పేరుతో మహిళలను ఘోరంగా కూటమి ప్రభుత్వం మోసం చేసిందని చెప్పారు. రాష్ట్రంలో వ్యవసాయానికి కరెంటు కోతలు, త్రాగునీటికి ప్రజలు అల్లాడుతున్నారని చెప్పారు. ఇచ్చిన హామీలు అన్ని గాలిలోకి కలిసి పోయాయి అన్నారు. సోషియల్ మీడియాలో కూటమి నేతలు మాత్రం విచ్చల విడిగా మాట్లాడవచ్చు అన్నారు. అదే వైఎస్ఆర్ సిపి నేతలు మాట్లాడితే అరెస్టులు చేస్తారని తెలిపారు. షర్మిలమ్మ చంద్రబాబు ట్రాప్‌లో పడి వై.ఎస్.జగన్ పై విమర్శలు చేయడం శోచనీయం అన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**చిట్వేలి, మార్చి 8, ప్రభాతవార్త:**

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఐసిడిఎస్ చిట్వేలి ప్రాజెక్టు పరిధిలో సిడిపిఓ నిర్మలా జ్యోతి ఆధ్వర్యంలో శనివారం ఘనగా నిర్వహించారు. సిడిపిఓ మాట్లాడుతూ స్త్రీ శక్తి అపారమైనదని, అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. మహిళ విజయాలను స్మరించుకుంటూ మహిళా దినోత్సవం నిర్వహించడం సంతోషకరమన్నారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్రపతి అవార్డు గ్రహీత మైసూర వారి పల్లి సర్పంచ్ సంయుక్త మాట్లాడుతూ తల్లిదండ్రులు సమాజం పట్ల తమ పిల్లలకు దిశా నిర్దేశం చేయాలన్నారు. సంపూర్ణ ఆత్మ విశ్వాసంతో దేనినైనా సాధించవచ్చుని, దృఢ నిశ్చయం ప్రతి మహిళలో ఉండాలన్నారు. మాజీ సర్పంచ్ కట్టా ఉమాదేవి మాట్లాడుతూ కుటుంబ ప్రతిష్టను పెంపొందించడంలో స్త్రీ పాత్ర కీలక మన్నారు. కూటమి నాయకులు రామాంజనేయులు నాయుడు,లారీ సుబ్బరాయుడులు మాట్లాడుతూ ప్రతి మహిళ సంపూర్ణ సాధికారత లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథులను సత్కరించారు.అనంతరం ఆటల పోటీలలో గెలుపొందిన సూపర్వైజర్లు, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు బహుమతులు అందించారు.కార్యక్రమంలో సూపర్వైజర్లు వసుందరమ్మ, సురేఖా రాణి, చిట్వేలి పెనగలూరు మండలాల అంగన్వాడి వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ముఖ్య అతిథులను సత్కరిస్తున్న సిడిపిఓ, సిబ్బంది.

## మహిళా సంక్షేమంతోనే జాతి సంక్షేమం సాధ్యం

బద్వేలు, మార్చి 8, ప్రభాతవార్త



మహిళా సంక్షేమంతోనే జాతి సంక్షేమం సాధ్యమ న శ్రీ బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వెంకటసుబ్బారెడ్డి అన్నారు .శనివారం ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని యన్.యస్.యస్.ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళలకు సమాన హక్కులను కల్పిస్తూ,వివక్షతను చూపకుండా సమానత్వాన్ని పాటించడం ద్వారా సామాజిక అభివృద్ధి జరుగుతుందని తెలిపారు .కంప్యూటర్ అధ్యాపకురాలు .డి.స్వర్ణలత మాట్లాడుతూ స్త్రీలను గౌరవిచడంతో పాటు సమాన హక్కులను కల్పించడం వలన స్త్రీ, పురుషుల మధ్య విబేధాలు తొలగి సామాజిక సుస్థిర అభివృద్ధి జరుగుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో యన్.యస్.యస్. సమన్వయ కర్తలు డా.యం.దొరస్వామి నాయక్, సి.హెచ్.ఈశ్వరయ్య, డా. జి.రవీంద్ర రెడ్డి మరియు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా 6053 కేసులు పరిష్కారం

కడప లీగల్, మార్చి 8, ప్రభాతవార్త:



జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా 6053 కేసులు పరిష్కరించడం జరిగిందని రూ.16.58కోట్లు కక్షిదారులకు చెల్లించడం జరిగిందన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు మరియు లోక్ అదాలత్ వమెంబర్లు, కోఇదారులు, వారి వారి న్యాయవాదులతో సంప్రదింపులు జరిపి వారి వారి కేసులను పరిష్కరించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి వెంకటేశ్వరరావు, 4వ అదనపు జిల్లా న్యాయమూర్తి దినబాబు, సీనియర్ సివిల్ జడ్జీ ప్రత్యూష, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జీ శ్రీమతి ఆసిఫా సుల్తానా, ఎక్సైజ్ కోర్టు జడ్జీ శ్రీమతి హేమ స్రవంతి, మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ ఆశాప్రియ, కడప బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గుర్రప్ప, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కక్షిదారులు, బ్యాంకు అధికారులు, ఇన్సూరెన్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రామసముద్రం, మార్చి8, ప్రభాతవార్త

రామసముద్రం మండలం, చెంబకూరు గ్రామ పంచాయతీ కేంద్రంలో ప్రతీ ఏటా నిర్వహించు శ్రీ గట్టు వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్బంగా ఆదివారం "అంకురార్పణ", సోమవారం సూర్యప్రభ వాహనం, మంగళవారం సింహ వాహనం, బుధవారం శేష వాహనం, గురువారం హనుమంత వాహనం, శుక్రవారం గజ వాహనం,శనివారం కళ్యాణోత్సవం, ఆదివారం రథోత్సవం, సోమవారం దోపు ఉత్సవం, మంగళవారం ధ్వజావరోహణం, బుధవారం పుష్ప పల్లకి, గురువారం పవళింపుసేవ,శుక్రవారం సుప్రభాత సేవ కార్యక్రమాలు జరుగుతున్నా యని కార్య నిర్వాహకులు, అర్చకులు తెలియజేశారు.కావున స్వామివారి ఈ బ్రహ్మోత్సవాలలో భక్తులందరూ పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని తెలియజేశారు.

## గెవన్నను సన్మానించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి

రామసముద్రం మార్చి 8 ప్రభాతవార్త

వైఎస్ఆర్సిపి స్టేట్ జనరల్ సెక్రెటరీగా ఇటీవలే నియమతులైన గెవన్నను శుక్రవారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఘనంగా సన్మానించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పుంగనూరులో జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో రామసముద్రం మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షులు కేశవరెడ్డి, వైస్ ఎంపీపీ వెంకట రమణారెడ్డి,మినికి సుబ్బారెడ్డి నాయకులు విజయ్ , ఉప సర్పంచ్ దొరబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### మహిళా ఉపాధ్యాయులపై భౌతిక దాడి హేయమైన చర్య

వేంపల్లి, మార్చి 08, ప్రభాతవార్త :

మహిళా ఉపాధ్యాయినులపై భౌతిక దాడి చేయడం హేయమైన చర్య అని బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు పి.సుష్మా అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులైన అంజలిపై దాడి, సునీతపై అసభ్య పదజాలంతో దూషించిన ఘటన సభ్య సమాజాన్ని తలదించేలా చేసిందన్నారు. ఇలాంటి సంఘటనలు జరగడం చాలా బాధాకరమన్నారు. పీజీటీ ఉపాధ్యాయుడిని, పాఠశాలకు రాకుండా చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. అలాగే ఘటన జరిగిన వెంటనే సమయస్ఫూర్తితో పోలీసులకు ఫిర్యాదు చేయడం అభినందనీయమన్నారు. అధికారులు స్పందించిన తీరు పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా కఠినంగా శిక్షించాలని కోరారు.

## మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

మదనపల్లె, మార్చి 8 ప్రభాతవార్త :

మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య, ఇతర కార్మికులను రెగ్యులర్ చేయాలని రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు జె.రామచంద్రయ్య పిలుపునిచ్చారు. శనివారం మున్సిపల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు చేస్తే ప్రజారోగ్యాన్ని, పర్యావరణాన్ని పరిరక్షిస్తున్న మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. ఈనెల 11న వర్కర్స్ చలో విజయవాడ మహాధర్నాకు సిద్దం కావాలని పిలుపునిచ్చారు. ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికుల సేవలను దశాబ్దాలు తరబడి ప్రభుత్వాలు వెట్టిచాకిరి చేయిస్తున్నారని ఆరోపించారు. పాలకులు మారుతున్నా కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపలేదన్నారు. కూటమి ప్రభుత్వమైనా అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టి కార్మికులను ఆదుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో యూనియన్ నాయకులు వర్రి సురేష్‌కుమార్, మస్తాన్,దేవేంద్ర, ముభారక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా హాయంలోనే మహిళలకు గుర్తింపు

మదనపల్లె, మార్చి 8 ప్రభాతవార్త :



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

వైకాపా ప్రభుత్వ హాయాంలోనే మహిళలకు అన్ని విధాల గుర్తింపు లభించిందని నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ తెలిపారు. శనివారం వైకాపా కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న హాయంలో మహిళలకు పెద్దపీట వేశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను కూడా నెరవేర్చలేదన్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తానే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంకల్పిస్తామని చెప్పి మోసం చేశారని ఏద్దేవా చేశారు. అనంతరం మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి ఆధ్వర్యంలో మహిళా కౌన్సిలర్లకు ఆయన ఘన సన్మానం చేశారు.

## ఘనంగా మహిళా దినోత్సవం

మదనపల్లె, మార్చి 8 ప్రభాతవార్త :



సన్మానిస్తున్న దృశ్యం

పట్టణంలోని చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థచే నడపబడుతున్న ముత్తు ఆంగ్ల మాద్యమ పాఠశాలలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా మహిళల హక్కుల గురించి తెలియజేశారు. నిమ్మనపల్లె మండల విద్యాశాఖాధికారి పద్మావతి, డాక్టర్ స్వాతి, మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ కవిత, ప్రవీణ్, చైతన్య సేవాసంస్థ బోర్డుఆఫ్ డైరెక్టర్లు పాల్గొన్నారు. సంస్థ వ్యవస్థాపకులు ఎంపి ఆనందన్, కవితారాణి, గిరిజామ్మాల్, డైరెక్టర్ డాక్టర్ జివిఎస్.బాబు, క్రిష్ణచరణ్‌లు పాల్గొని మహిళల యొక్క విశిష్టతను తెలిపారు.

## వెలుగుస్కూల్‌లో ఘనంగా మహిళా దినోత్సవం



మెమెంటోలు అందజేస్తున్న దృశ్యం

మదనపల్లె, మార్చి 8 ప్రభాతవార్త :

పట్టణ సమీపంలోని అమ్మచెరువుమిట్ట వద్ద ఉన్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వెలుగు సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రమాదేవి, ట్రాఫిక్ ఎస్ఐ శివకామిని, వైద్యాధికారిణి రాధిక, కిరణ్‌లు ముఖ్య అతిధులుగా పాల్గొని సన్మానించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మహిళలు విద్యతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినపుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం ముఖ్య అతిధులను వెలుగు సెక్రటరీ, సిబ్బంది శాలువలతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లీనాకుమారి, సోషల్ వర్కర్ గీతా, వార్డెన్ స్వీటి పాల్గొన్నారు.

## డైట్ సేవలు కొనసాగించాలి

సిద్దవటం, మార్చి 8, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన సిద్దవటం 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు అందించే పౌష్టికాహారం భోజనం సమకూర్చాలని రోగులు వేడుకున్నారు. ఈ సందర్భంగా శనివారం ప్రవీణ్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో శనివారం ఉదయం టిఫిన్ మధ్యాహ్న భోజనం అందించలేదని మా కుమారుడు సన్నీ ఆరోగ్యం సరిగా లేక వైద్యశాలలో వైద్య చికిత్సలు కోసం అడ్మిట్ చేశామని భోజనం అందించలేదని ప్రభుత్వ సెలవు దినం అయినందు వలన హోటళ్లు లేవని భాకరాపేటకు హైవే ప్రాంతమైన 6 కి.మీ వెళ్లి డాబా వద్ద భోజనం తెచ్చుకున్నామని తెలిపారు. ఈ విషయమై డా.ప్రకాష్‌ను వివరణ కోరగా డైట్ కాంట్రాక్టర్ మల్లు కృష్ణవేణి 27.1.23 నుంచి 2 సంవత్సరాలు రోగులకు డైట్ అందించడానికి కాంట్రాక్టు అగ్రిమెంట్ పొంది ఉన్నారని 19.1.25 గడువు ముగిసింది. తరువాత కూడా 7.3.25 వరకు కొనసాగించామని అయితే డైట్ ఎసేవలు కొనసాగింపు కోసం అధికారులకు నివేదిక పంపించామని డీడీఎంసీ నుంచి ఉత్తర్వులు ఇంకా రాలేదని ఆర్డర్ వచ్చిన వెంటనే డైట్ సేవలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

## మందగిరి శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు

సిద్దవటం, మార్చి 8, ప్రభాతవార్త:



కడప-చెన్నై జాతీయ రహదారి కనుమలోపల్లిలో వెలసిన శ్రీ మందగిరి శనీశ్వర స్వామి ఆలయంలో శనివారం ఉదయం స్వామి వారికి విశేష పూజలు జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామి వారికి తైలాభిషేకం పూజలు నిర్వహించారు. శనీశ్వరుడికి పూజలు చేస్తే సకల దోషాలు తొలగిపోతాయని భక్తులు ఉదయం నుంచి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుంది

బద్వేలు , మార్చి 08 ప్రభాతవార్త :



జనసేన ఆవిర్బావం నుంచి కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని మన నాయకుడు పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టిపెట్టారని కడప పార్లమెంటు జనసేన పార్టీ సమన్వయకర్త కాటంశెట్టి నాగేంద్ర, జిల్లా కో ఆర్డినేటర్ సుంకరశ్రీనులు అన్నారు. బద్వేలులో జనసేన సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి కార్యకర్తలకు ఛలో పిఠాపురం జనసేన ఆవిర్భావ సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాటంశెట్టి నాగేంద్ర మాట్లాడుతూ జనసేన ఆవిర్భావ సభ విజయవంతం చేసి జనసేన సత్తా చాటాలని నాయకుడు నిర్ణయించిన నేపథ్యంలో అన్ని జిల్లా, మండల, తాలూకా, గ్రామాల నుంచి తరలిరావాలని పిలుపునిచ్చారు. జనసేన కార్యకర్తలు పిఠాపురం సభకు తరలివచ్చే అంశంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పీఓసి బసివిరమేష్, నాయకులు తుడిమెళ్ల మురళికృష్ణ, రమణ, రంజిత్‌కుమార్, రాజగోపాల్, పత్తి విష్ణు, రామ్ సిద్ధు, బోరెడ్డి, నందకిశోర్, కొర్రపాటి సురేంద్ర, ఈశ్వర్‌రెడ్డి, ఖలీల్, సింగంశెట్టి వెంకటసుబ్బయ్య, సిద్దు, రమణయ్య, లక్ష్మయ్య, వెంకటేష్, మనోహర్, శ్రీకాంత్‌రెడ్డి, గంగిరెడ్డి తదితర జనసేన నాయకులు

### వాహనదారులకు సౌకర్యంగా నిర్మాణం పనులు చేయాలి

పీలేరు మార్చి 8 ప్రభాత వార్త :



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసరావు

పట్టణంలో చేపట్టిన ఆర్ఓబి నిర్మాణం పనుల సందర్బంగా వాహనదారులకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్మాణం చేయాలని 9వ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎన్. శ్రీనివాసరావు సంబంధిత అధికారులకు సూచించారు. పీలేరు 11వ అదనపు జిల్లా జడ్జి న్యాయస్థానంలో శనివారం జరిగిన లోక్‌అదాలత్ లో న్యాయమూర్తి అధికారులతో మాట్లాడుతూ పీలేరు పట్టణంలోని చిత్తూరు రోడ్డు, మదనపల్లి మార్గంలోని రైల్వే గేట్ల వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు గత రెండేళ్లుగా జరుగుతున్నాయని, రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లకు గుర్తులు పెట్టి నిర్మాణాలను కూడా తొలగించారని, అయినా ఇంకా పనులు పూర్తి కాని ఫలితంగా రోడ్లకు ఇరువైపులా ఉన్న ఇళ్ల యజమానులు తమ దెబ్బ తిన్న ఇళ్లకు మరమ్మతులు చేసుకోలేక పోతున్నారన్నారు. అంతేకాకుండా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి మదనపల్లె రోడ్డులోని మలుపు వరకు రోడ్డుకు ఇరువైపులా జాతీయ రహదారుల శాఖ ఇంజినీర్లు మురుగునీటి కాలువలు నిర్మిస్తున్నారని, ఆ కాలువ ల నిర్మాణం పనుల్లో జాప్యం జరుగుతున్న కారణంగా రోడ్డుపై గతుకులు ఏర్పడడంతో పాటు విపరీతమైన దుమ్ము, ధూళి వస్తుండడంతో అటు వాహనదారులు, ఇటు పాదచారులు, రోడ్లకు ఇరువైపులా నివాసాలు ఉండే ఇండ్ల యజమానులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయమై అధికారులు న్యాయమూర్తితో మాట్లాడుతూ తాము మురుగుకాలువపై ఉన్న ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి తొలగించాలని హెచ్చరించి కొన్నింటిని తొలగించామని, మురుగుకాలువ పనులు ఎం.హెచ్ ఇంజనీర్లు వారికి కూడా సమాచారం అందివ్వాలని కోరారు. అలాగే శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో 87 కేసులు పరిష్కరించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎంపీడీవో శివశంకర, డిప్యూటీ తహశీల్దారు చంద్రశేఖర్, 3వ సచివాలయ కార్యదర్శి జ్ఞానశేఖర్, బిఎస్ఎన్ఎల్ జేఈ, ఆర్టీసీడిపో మేనేజర్ హాజరయ్యారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖాజీపేట, మార్చి 08, ప్రభాతవార్త:



ప్రజలకి నాణ్యమైన అంతరాయాలు లేని విద్యుత్ అందించాలనే కార్యక్రమంలో భాగంగా ఖాజీపేటలోని విద్యుత్ కేంద్రాల మరియు విద్యుత్ తీగలు, స్థంబాల మరమ్మత్తులు చేస్తున్న కారణంగా ఆదివారం నాడు మండలంలో ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు, ప్రజలు సహకరించాలని ఖాజీపేట మండల బాధ్య ఏఈ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

## మండల సమావేశం వాయిదా

ఒంటిమిట్ట మార్చి 8 ప్రభాతవార్త

మండల సర్వసభ సమావేశం వాయిదా పడినట్లు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు శనివారం మండల సమావేశం నిర్వహించారు కానీ సమావేశానికి ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు ఒక్క ఎంపీటీసీ మాత్రమే సమావేశానికి విచ్చేశారు దీంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు సమావేశం తిరిగి ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామన్నారు

## 10 వ తరగతి వీడ్కోలు సమావేశం..

సుండుపల్లి, మార్చి08, ప్రభాతవార్త:

మండల పరిధిలోని పుల్లారెడ్డి గారి పల్లెవద్ద ఉన్న ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల నందు శనివారం 10 వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఘనంగానిర్వహించారు.ఈ సమావేశమునకు ముఖ్య అతిధి గా మండల విద్యాశాఖ అధికారి 2 రవీంద్ర నాయక్, విశిష్ట అతిధి రిటైర్డ్ హిందీ ఉపాధ్యాయులు మహబూబ్ బాష, మరియు పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు నాయుడు, ఉపాధ్యాయలు ఉపాద్యేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

దువ్వూరు, మార్చి 08, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కడప-కర్నూల్ జాతీయ రహదారిపై జిల్లెల్ల గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దూదేకుల బాష(26) మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..జిల్లెల్లకు చెందిన దూదేకుల బాష రాత్రి 11గంటల సమయంలో రోడ్డు దాటుతుండగా దువ్వూరు నుండి ఆళ్లగడ్డ వైపు పోరు కారు ఢీకొంది. దీంతో దూదేకుల బాషకు గాయాలై కిందపడి పోయాడు. ఆ సమయంలో పొలాల వద్దకు వెల్లే వ్యక్తులు గుర్తించి తండ్రి పెద్ద ఉశేన్‌కు తెలియజేశారు. తల్లిదండ్రులు, బంధువులు వచ్చి చూడగా అప్పటికే మరణించాడు. ఈ ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

## 6మంది జూదరులు అరెస్ట్

దువ్వూరు, మార్చి 08, ప్రభాతవార్త:

మండల పరిధిలోని నీలాపురం పుట్టమీద జూదం ఆడుతున్న 6మందిని శనివారం ఆదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 15450రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. ఈ 6మంది వివిధ గ్రామాల నుండి వచ్చి జూదం ఆడుతున్నారని సమాచారం రావడంతో దాడులు నిర్వహించారు. వీరిని త్వరలో మైదుకూరు కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు.

### స్వామిత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

పోరుమామిళ్ల రూరల్ మార్చి 8ప్రభాతవార్త :



కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా గ్రామాల సర్వే కోసం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వామిత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బద్వేల్ డివిజనల్ పంచాయతీ అధికారి ఆర్ రమణారెడ్డి పేర్కొన్నారు. శనివారం పోరుమామిళ్ల మండలంలోని శ్రీ శక్తి భవనములో డివిజన్లోని 9 మండలాలకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఒకరోజు శిక్షణా తరగతిని నిర్వహించారు. ప్రారంభ కార్యక్రమంలో డిఎల్పిఒ రమణారెడ్డి మాట్లాడుతూ గ్రామాలలోని నాన్ అగ్రికల్చర్ స్థలాలు, భవనాలు, ఇతర ఆస్తులను సర్వే చేసి వాటిని ఒక ప్రత్యేక సంఖ్యతో నమోదు చేస్తామని చెప్పారు. శిక్షకులు ఆర్ సి ఓబులేసు, పురుషోత్తమ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఉదయ్ కుమార్ పలు అంశాలను వివరించారు. కార్యక్రమములో సర్వే చేసిన తదుపరి హక్కుదారులకు తమ ఆస్తికి సంబంధించి కొలతలతో కూడిన ప్రాపర్టీ పార్సిల్ మ్యాప్‌ను అందిస్తామని చెప్పారు. ఉదయం తరగతిలో స్వామిత్వ ప్రాముఖ్యత ఎలా చేయాలో అనే అంశాలను వివరించారు. మధ్యాహ్నం జియోగ్రాఫికల్ సాంకేతికత, రోవర్, డ్రోన్ ను స్వామిత్వలో వినియోగించడంపై ప్రాక్టికల్ గా వివరించారు. కార్యక్రమంలో పాల్గొనే ఉద్యోగులు తమ విధులను సక్రమంగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## కుట్టు మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానం

పోరుమామిళ్ల రూరల్, మార్చి 8ప్రభాతవార్త:

మండలంలోని ఆయా గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న అర్హులైన బిసి, ఈడబ్ల్యూఎస్, కాపు మహిళలు కుట్టు మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రమణారెడ్డి శనివారం తెలిపారు. మహిళలు గ్రామ సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్ వద్ద దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. వీటిని పరిశీలించిన అనంతరం అర్హులను ఎంపిక చేస్తారని, వీరికి తదుపరి నియోజకవర్గస్థాయిలో శిక్షణ ఇస్తారని ఆయన పేర్కొన్నారు.

### మట్టి మాఫియాను అనుమతులు అడిగినందుకు...

సుండుపల్లె, మార్చి08, ప్రభాతవార్త:



మండల కేంద్రానికి దగ్గరలో పెద్ద మాదిగపల్లి వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా అర్ధరాత్రి సమయంలో ట్రాక్టర్ లతో మట్టి మట్టి తోలుతున్నారు అనే సమాచారంతో దగ్గరలోని గ్రామస్తులు, రెవెన్యూ అధికారులకు పోలీసు అధికారులకు పాత్రికేయులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి వెళ్లిన పాత్రికేయులపై జెసిపి యజమాని దురుసుగా మాట్లాడడంతో శనివారం ఎస్పై ముత్యాల శ్రీనివాసులకు విలేకరులతో కలిసి ఫిర్యాదు చేశారు. విలేకరులపై దురుసుగా ప్రవర్తించిన జెసిపి ఓనర్ పై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ విషయంపై ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు స్పందిస్తూ గతంలో ఆ వ్యక్తి పై కేసు కూడా ఉందని చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల విలేకరులు,నాయకులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

బద్వేలు అర్బన్ , మార్చి 08 ప్రభాతవార్త :

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం సాయంత్రం వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధకు పారిశ్రామిక వేత్త సానపురెడ్డి రాధాక్రిష్ణారెడ్డి శాలువా, పూలబొకేతో సత్కరించి స్వీట్ బాక్స్ అందజేశారు. ఈ సందర్భంగా రాధాక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాలలో రాణించడం ఎంతో గర్వకారణమన్నారు. మహిళా ఎమ్మెల్యే గా డాక్టర్ సుధ బద్వేలు నియోజకవర్గంలో రెండవ సారి గెలిచి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడంలో ముందున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ సాయిక్రిష్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.

## 300 లీటర్లు నాటు సారా ఊట ధ్వంసం..

సుండుపల్లె, మార్చి08, ప్రభాతవార్త:

మండల పరిధిలోని పోలిమేర పల్లె గ్రామపంచాయతీ తూర్పు మాలపల్లి సమీపంలో 300 లీటర్ల నాటు సారా ఊటను ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు శనివారం ధ్వంసం చేశారు. మండల పరిధిలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బి.డి. నాయక్, కానిస్టేబుల్ ప్రవీణ్ పాల్గొన్నారు.



## శ్రీవారి వాలయానికి రూ.1,11,116లు

బద్వేలు అర్బన్ , మార్చి 08 ప్రభాతవార్త :



శ్రీదేవిభూదేవి సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆవరణంలో ఆర్చి ముఖ ద్వారమునకు రూ.1,11,116 లు విరాళాన్ని ప్రముఖ పారిశ్రామిక వేత్త సానపురెడ్డి రాధాక్రిష్ణారెడ్డి శనివారం మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బాదిరెడ్డి వెంకట రామిరెడ్డికి అందజేశారు. ముఖ్యంగా ప్రభుత్వ పెన్షనర్స్ కార్యాలయానికి రూ.5లక్షలు విరాళాన్ని అందజేయడం తోపాటు శ్రీవారికి ఆలయానికి కూడా ఆర్చి ముఖ ద్వారానిక సహాయం అందించిన వారికి, వారి కుటుంబ సభ్యులు కలియుగ వైకుంఠదైవం వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఉండి వారు వ్యాపారాభివృద్ధిలో దినదినాభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌బోర్డు సభ్యులు జొన్నలగడ్డ శ్రీధర్, జయరామిరెడ్డి, నారాయణరెడ్డి, మరియు ఆలయసిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి మహిళా ఒక శక్తి స్వరూపమే




బద్వేలు అర్బన్ , మార్చి 08 ప్రభాతవార్త :

ప్రతి మహిళా ఒక శక్తి స్వరూపమే అని ఎమ్మెల్యే డాక్టర్ సుధ అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీ రాచపూడి నాగభూషణం డిగ్రీ మరియు పీజీ కళాశాలలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచంలో ఎంతోమంది మహిళలు అన్ని సవాళ్లను ఎదుర్కొంటు ముందుకెళ్లారని, ప్రతి విద్యార్థిని వారి స్ఫూర్తితో ముందుకు సాగాలని, నేడు మహిళలు తమపట్ల తామే రక్షణ కల్పించుకోవాలన్నారు. సైబర్ నేరాలతో మహిళా బాధితులు ఎక్కువగా ఉన్నారని, అందుకే మహిళా చట్టాలను బలోపేతం చేయాలన్నారు. స్త్రీలను గౌరవించడం మహిళాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమకు సహాయంగా వారికి స్వేచ్ఛను అందించాలని కళాశాల పరిపాలనాధికారి సాయిక్రిష్ణ అన్నారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు పలువురిని కళాశాల బోర్డు మెంబర్ రాచపూడి సుజన, మహిళా అధ్యాపకులు షాహినా, లక్ష్మిదేవి, డాక్టర్ రామసుధ, సల్మా, తులసి, తేజస్విని, సుహాన, డాక్టర్ శ్రీలత హసీనాలతోపాటు పలువురు సత్కరించారు. తమ అమూల్యమైన సలహాలు, సూచనలు విద్యార్థులకు అందించారు.

## 600 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

బద్వేలు , మార్చి 08 ప్రభాతవార్త :

పట్టణంలోని నాలుగురోడ్ల కూడలిలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేస్తుండగా శనివారం 600 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. రాబడిన సమాచారం మేరకు సీఐ రాజగోపాల్ తనిఖీలు నిర్వహిస్తుండగా మైదుకూరు నుంచి నెల్లూరుకు వెళ్తున్న లారీని ఆపి అందులోని బియ్యం సంచులను గమనించి పరిశీలించగా రేషన్ బియ్యం అనే అనుమానం రావడంతో పట్టుకున్నారు. జమ్మలమడుగు నుంచి ఈ రేషన్ బియ్యం బద్వేలు మీదుగా క్రిష్ణపట్నం పోతున్నట్లు సమాచారం. రెండు రోజులలోనే వెయ్యి బస్తాలకు పైగా రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## ఏఐటిఎస్ విద్యార్థులకు కోడ్‌క్రాఫ్ట్ హాకథాన్‌లో జాతీయ స్థాయి విజయం



(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)

రాజంపేట ఏఐటిఎస్‌కు చెందిన 5గురు విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించిన కోడ్‌క్రాఫ్ట్ హాకథాన్‌లో పాల్గొని, "హ్యాండ్‌రైటింగ్ రికగ్నిషన్ సిస్టమ్" అనే ప్రాజెక్టును రూపొందించి ప్రతిభను చాటారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), మెషిన్ లెర్నింగ్ (ఎం ఎల్) పద్ధతులను ఉపయోగించి ఈ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేయడం ద్వారా, ఆటోమేటెడ్ హ్యాండ్‌రైటింగ్ గుర్తింపు వ్యవస్థను సమర్థవంతంగా రూపొందించారు. కోడ్‌క్రాఫ్ట్ హాకథాన్ 48 గంటల నిరంతర ఆన్‌లైన్ పోటీగా నిర్వహించబడింది. ఇందులో దేశవ్యాప్తంగా ఉన్న వివిధ విద్యాసంస్థల నుంచి అనేక మంది విద్యార్థులు పాల్గొన్నారు. హాకథాన్‌లో కొత్త సమస్యలను పరిష్కరించే సాంకేతిక పరిజ్ఞానాలను అభివృద్ధి చేయడం, కోడింగ్ నైపుణ్యాలను మెరుగుపరచడం, సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. కోడెట్రూ సంస్థ ఈ హాకథాన్‌ను సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి రంగాల్లో నైపుణ్యం కలిగిన యువ ప్రతిభావంతులను గుర్తించేందుకు నిర్వహించింది. ఈ సంస్థకు టాంపా (ఫ్లోరిడా), చికాగో (ఇలినాయిస్), హైదరాబాద్ (తెలంగాణ) నగరాల్లో కార్యాలయాలు ఉన్నాయి. కోడెట్రూ ఉత్తమ టెక్నికల్ నైపుణ్యం కలిగిన విద్యార్థులను ఎంపిక చేసి, వారికి పరిశ్రమ స్థాయిలో ఉద్యోగ అవకాశాలను అందించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఎ ఐ టి ఎస్ రాజంపేట విద్యార్థుల బృందం హాకథాన్‌లో ప్రథమ స్థానం సాధించింది. ఈ విజేతల్లో కున్ననన్ రెడ్డి చిట్టేపు, ఆనంద గోపాల్ రెడ్డి మానే, యనమల అఖిల్ కుమార్ రెడ్డి, గుబగుండం మహేంద్ర, మేక మనోజ్ లున్నారు. వీరి ప్రతిభను గుర్తించి కోడెట్రూ సంస్థ రూ.1,00,000 నగదు బహుమతిని అందజేసింది. అంతేకాకుండా, ఈ విద్యార్థులకు సంస్థ నుంచి ఉద్యోగ అవకాశాలు కూడా ప్రకటించింది. హాకథాన్‌లో వీరు ప్రదర్శించిన సాంకేతిక నైపుణ్యాన్ని పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా గుర్తించి, అధిక వేతనంతో ఉద్యోగ అవకాశాలను కల్పించింది. ఈ గౌరవాన్ని అందుకున్న విద్యార్థులను అన్నమాచార్య విశ్వవిద్యాలయ ఉపకులపతి డా. ఈ. సాయి బాబా రెడ్డి, ప్రో చాన్సలర్ సి. అభిషేక్ రెడ్డి, రిజిస్ట్రార్ డా. ఎన్. మల్లికార్జున రావు, తి।గిలీ రాజంపేట ప్రిన్సిపాల్ డా. ఎస్. ఎమ్. వి. నారాయణ, మరియు దిళీని బీవీదీ డా. ఎం. సుబ్బారావు అభినందించారు. ఈ సందర్భంగా ప్రో చాన్సలర్ శ్రీ సి. అభిషేక్ రెడ్డి మాట్లాడుతూ, "మేము మా విద్యార్థులను హాకథాన్‌లు, కోడింగ్ పోటీలు, మరియు సాంకేతిక ప్రాజెక్టుల వైపు ప్రోత్సహిస్తున్నాం. విద్యార్థులు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా కోడింగ్ నేర్చుకోవడానికి ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాం. ఈ విజయం మా విద్యార్థుల కృషికి ప్రతిఫలంగా మారింది" అని పేర్కొన్నారు.

## పరిరక్షణ కూటమి ప్రభుత్వంలోనే సాధ్యం

బద్వేలు, మార్చి 8, ప్రభాతవార్త

గత ప్రభుత్వం చేతకాని తనంతోనే అవధూత కాశినాయన దేవాలయానికి విషయం ఇంత వరకు వచ్చిందని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ తెలిపారు. కాశినాయన ఆలయం పై ఎమ్మెల్సీ గోవిందరెడ్డి మాటలను ఆమె తీవ్రంగా ఖండించారు. వై ఎస్ఆర్సీపీ నాయకులకు ఈ విషయం గురించి మాట్లాడే అర్హత లేదని, ఈ జిల్లాకు చెందిన ముఖ్యమంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే గడిచిన ఐదు సంవత్సరాలు నిద్రపోయారా అని ఆమె ప్రశ్నించారు. ఎ ఒక్క రోజైనా కాశీనాయన దేవాలయం గురించి మాట్లాడిన పాపాన పోలేదని వైసిపి వారిని దుయ్యబట్టారు. శ్రీ అవధూత కాశినాయన స్వామి జ్యోతి క్షేత్రంలో సజీవ సమాధి పొందిన అనంతరం, బద్వేల్ మాజీ శాసనసభ్యుడు దివంగత వీరారెడ్డి భక్తుల ఆరాధన కోసం ఆలయాన్ని నిర్మించారని ఆమె గుర్తు చేశారు. ఫారెస్ట్ క్లియరెన్స్ సమస్యను వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా చూశారని, వారి పాలనా కాలంలోనే కేంద్ర ప్రభుత్వం కూల్చివేతల ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లను కలిసి ఫారెస్ట్ క్లియరెన్స్ సాధించేందుకు సహకరించాలని కోరగా, వారు సానుకూలంగా స్పందించి రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేంద్రాన్ని ఒప్పించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలియజేశారు.

## కురబలకోటలో పొలం పిలుస్తోంది



కురబలకోట, మార్చి 8 ప్రభాతవార్త

మండలం ఎర్రవల్లి పంచాయతీ బలకవారిపల్లి యందు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్యాప్ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఇందులో భాగంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్ర నాయక్ మాట్లాడుతూ పంట పెట్టుబడి ఖర్చు తగ్గించుకుంటూ అధిక ఆదాయాలు పొందే మార్గాలను రైతులకు సవివరంగా వివరించారు ముఖ్యంగా కే6 వేరుశనగరకం కు బదులుగా 1694 రకం విత్తుకుంటే అధిక దిగుబడి వస్తుందని తెలియజేశారు వేరుశనగ పంట యందు వేరుకుళ్ళు కాండం కుళ్ళు నివారించడం కోసం విత్తన శుద్ధి యొక్క ఆవశ్యకతను సవివరంగా తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఘనజీవామృతం ద్రవజీవామృతాలను వాడడం ద్వారా మంచి దిగుబడిని సాధించవచ్చని తెలియజేశారు. డ్రోన్ పద్ధతిలో మందులను ఒక రోజుకు 20 నుండి 30 ఎకరాలు మందులు స్ప్రే చేసుకోవచ్చని దీని ద్వారా సమయం డబ్బు మందులు అన్ని ఆదా అవుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు మండల వ్యవసాయ శాఖ అధికారి మరియు మండల రైతు సేవా కేంద్రాల సిబ్బంది హాజరు కావడం జరిగింది.

## జాతీయ సాహిత్య పురస్కార ప్రధానోత్సవం



ప్రొద్దుటూరు మార్చి 8 ప్రభాతవార్త

ప్రొద్దుటూరుకు చెందిన కొనిరెడ్డి ఫౌండేషన్ మరియు చదువుల సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో కొనిరెడ్డి శివచంద్రారెడ్డి అధ్యక్షతన జాతీయ సాహిత్య పురస్కార ప్రధాన ఉత్సవం శనివారం స్థానిక ఎస్.కె గ్రాండ్ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ రంగాలలో నిష్ణాతులైన సాహిత్య కథకులు సాహిత్య పోషకులు సాహిత్య మేధావులు రాసిన కథలలో కొన్నిటిని కొందరు న్యాయమూర్తుల చేత ఎంపిక చేసుకుని ఆరు మందికి కథా పురస్కారాలను ప్రధానం చేశారు. అనంతరం కొన్ని రెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా కొన్ని రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమానికి విజయవంతం చేసేందుకు ఎంతో మంది సరస్వతి పుత్రులు రావడం సంతోషకరమన్నారు. ఐదు రాష్ట్రాల నుండి వచ్చిన సరస్వతి పుత్రులు ఒకే చోట చేరి కార్యక్రమంలో పాల్గొనడం తమకు ఎంతో విలువైనదిగా ఆయన అభిప్రాయపడ్డారు. తమ చేతిలో ఉన్న గా పురస్కారం అందుకున్న సరస్వతి పుత్రులు తవ్వా ఓబులరెడ్డి, ఈతకోట సుబ్బారావు వశిష్ట సోమేపల్లి జంగం స్వయంప్రభ మాచిరాజు కామేశ్వరరావు డాక్టర్ ఎం హరి కిషన్లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమానికి వచ్చి విజయవంతం చేసిన సాహితీ అభిమానులకు మిత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## స్కాలర్షిప్‌కు 5 మంది విద్యార్థులు ఎంపిక

పెనగలూరు, మార్చి 8, ప్రభాతవార్త:



మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నల్లపురెడ్డిపల్లి నుంచి 5 మంది విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్‌కు ఎంపికైనట్లు మండల విద్యాశాఖ అధికారి1, తెలిపారు. 8వ తరగతి చదువుతున్న సుదీప్తి ,దేవకి, నాగచైతన్య, దీక్షిత, రేణుక ఎంపికైనట్లు ఆయన తెలిపారు ఎంపికైన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఒకే పాఠశాలలో ఐదు మంది విద్యార్థులకు జాతీయస్థాయి లో నిర్వహించిన స్కాలర్షిప్ కు ఎంపిక కావడానికి కృషిచేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు నీలకంఠేశ్వర రాజు , ఉపాధ్యాయులు శ్రీనివాసులు, బాబు, నరసింహులు, చౌదరి ప్రభాకర్ రెడ్డి, బాబా రజాక్ లను ప్రత్యేకంగా అభినందించారు. ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రతి సంవత్సరం 12000/రూపాయల నగదును, నాలుగు సంవత్సరాలకు కలిపి 48 వేల రూపాయలు ప్రభుత్వము జమ చేయనున్నట్లు ఎంఈఓ తెలిపారు.

## శ్రీ చైతన్య హైస్కూల్లో ఘనంగా స్పోర్ట్స్ మీట్



ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 8, ప్రభాతవార్త :

పట్టణంలోని శ్రీ చైతన్య హై స్కూల్ 5వ బ్రాంచ్ లో మహిళా దినోత్సవ సందర్భంగా శనివారం డాక్టర్ బిఎస్ రావు మెమోరియల్ పేరుతో ఏజీఎం నాగిరెడ్డి ఆధ్వర్యంలో జోనల్ స్పోర్ట్స్ మీట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డిఎస్పి భావన, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున జ్యోతి వెలిగించి స్పోర్ట్స్ మీట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంత భారీ స్థాయిలో స్పోర్ట్స్ మీట్ జరపడం అభినందనీయమని, విద్యార్థులు శారీరకంగా బలంగా ఉన్నప్పుడే మానసికంగా దృఢంగా ఉంటారని తద్వారా మంచి ఫలితాలు రాబట్టవచ్చు అన్నారు. మానసికంగా బలంగా లేకపోవడం వల్ల ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉందని అటువంటి ఆలోచనలు రాకుండా ఉండాలంటే విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి కలిగి మనసు దృఢం చేసుకోవాలన్నారు. విద్యాసంస్థల విద్యార్థులు, పోరుమామిళ్ల శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు.

## 2.0 కార్యక్రమం విజయవంతం అయ్యేలా పనిచేయాలి

వాల్మీకిపురం, మార్చి 8 ప్రభాతవార్త:

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నవోదయం 20 కార్యక్రమాన్ని విజయవంతం అయ్యే విధంగా ప్రొహిబిషనల్ శాఖ సిబ్బంది పని చేయాలని కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమీషనర్ వేంపల్లె చంద్రశేఖరరెడ్డి అన్నారు శనివారం స్థానిక ప్రొహిబిషనల్ ఎక్సైజ్ స్టేషన్ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు స్టేషనల్ పనిచేస్తున్న సిబ్బంది బాధ్యతతో ఉండాలని, నాటుసారా నిర్మూలనకు కృతనిశ్చయంతో పనిచేయాలన్నారు విధినిర్వహణలో ఎటువంటి పొరపాట్లు దొర్లనివ్వద్దని సూచించారు నాటుసారా కట్టడిలో భాగంగా గ్రామాలకు వెళ్లినప్పుడు నాటుసారా తయారీ దారులకు ప్రత్యామ్నయ జీవనోపాదుల మార్గాలపై అవగాహన కల్పించాలని సూచించారు ఈ కార్యక్రమంలో సీఐ లత, ఎస్సై సుభాషిణి, ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

## అన్నదానంతోనే తనకు ఆత్మసంతృప్తి

ప్రొద్దుటూరు, మార్చి 8, ప్రభాతవార్త



అన్నదానంతోనే తనకు ఆత్మ సంతృప్తి కలుగుతుందని టిడిపి బిసి నాయకులు చల్లా రాజగోపాల్ యాదవ్ తెలిపారు. శనివారం స్థానిక మైదుకూరు రోడ్డులోని అన్వర్ హాల్ వద్ద ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గత మూడు సంవత్సరాలుగా చేపట్టిన అన్నదాన కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఈ సందర్భంగా చల్లా రాజగోపాల్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి శనివారం పేదలకు అన్నదాన చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చల్లా రవి శంకర్ యాదవ్, మూరబోయిన శ్రీనివాస్ యాదవ్, చింతల రాఘవేంద్ర యాదవ్, బంగి శివప్రసాద్, టైలర్ ప్రసాద్, నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బలపనూరు శ్రీనివాసులు, జయచంద్రయాదవ్, నల్లం రవిశంకర్, డ్రైవర్ బాషా, నేలటూరి దస్తగిరి, సునీల్, గోపవరం సుబ్బరాయుడు, హరీష్, రవి పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 8 ప్రభాతవార్త :



అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీవో హోమ్ లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ సురేఖ, ఎన్జీవో ప్రెసిడెంట్ రఘురామిరెడ్డి పాల్గొన్నారు. డాక్టర్ సురేఖ మాట్లాడుతూ ప్రతి ఒక్కమహిళా ధైర్యం, సహనం,సమయస్ఫూర్తితో ముందుకు నడిచి సమస్యలు సాధించు కోవాలని, ఈనాడు ఉద్యోగిని అన్నిరంగాలలో పురుషులకు తగ్గకుండా రాణిస్తూ దేశాభివృద్ధిలో తోడ్పడుతన్నారని, అన్ని రంగాల్లో ఇంకా ముందుకు వెళ్లాలని కోరారు. రఘు రామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి మహిళా ఉద్యోగిని ఏదైనా సమస్య వచ్చినప్పుడు నిరుత్సాహం చెందకుండా ధైర్యంగా ముందుకు వస్తే మేము కూడా మీకు సహాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు జయమ్మ, మహిళావిభాగం కన్వీనర్ రషియా బేగం, వైస్ ప్రెసిడెంట్ జయంతి కుమారి, కార్యదర్శి రామ సుబ్బయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సదాశివ యాదవ్, వైస్ ప్రెసిడెంట్ లు మధు, శివ రామానుజ, నాగరాజు , ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రభంజన ,జాయింట్ సెక్రటరీ నాగార్జున, ఉమా మహేశ్వర రెడ్డి , ఆయుష విభాగం మహేష్, మహిళా జాయింట్ సెక్రటరీ సంధ్య రాని పాపిరెడ్డి,నాయక్,ప్రభాకర్, మహిళా శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులు, రాజు పాలెం, కామానూరు , ప్రొద్దుటూరు టౌన్ మహిళా ఉద్యోగులు పె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పోటీలలో పాల్గొన్న మహిళలకు మొదటి, ద్వితీయ బహుమతులు దాదాపు 62 మందికి అందించారు.

## ఘనంగా 20వ వార్షికోత్సవ వేడుకలు

ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 8 ప్రభాతవార్త :



గీతాంజలి హైస్కూల్ 20వ వార్షికొత్సవ వేడుకలను గీతాంజలి ఉత్సవ్ అనే పేరుతో శనివారం గొల్టన్ పార్కు నందు ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్బంగా పాఠశాల చైర్మన్ శ్రీయా రెడ్డి మాట్లడుతూ చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ విధ్యార్థికి అవసరమని,విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ప్రిన్సిపాల్ మాట్లడుతు విద్యార్థుల భావిషత్తు గురించి చక్కగా వివరించారు. ఈ సమవేశంలో విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రాజీ మార్గమే రాజమార్గం

వాల్మీకిపురం, మార్చి 8 ప్రభాతవార్త:



లోక్ అదాలకు కేసుల పరిష్కారం

దీర్ఘకాలిక కేసుల పరిష్కారంతోనే కక్షిదారులకు ప్రశాంత జీవితం సాధ్యమని జడ్జి గురు అరవింద్ అన్నారు. శనివారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో జాతీయలోక్అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న కేసులను కక్షిదారుల మధ్య రాజీమార్గంతో జడ్జి పరిష్కరించారు. జాతీయలోక్ అదాలత్ ద్వారా 133 కేసులను పరిష్కరించగా, ఈ కేసుల ద్వారా దాదాపు రూ 32,10,959 నగదును రికవరి చేసినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. అంతకు మునుపు కక్షిదారులను ఉద్దేశించి జడ్జి మాట్లాడుతూ పట్టింపులకు పోయి కక్షిదారులు నిత్యం కోర్టులు, పోలీసు స్టేషన్ల చుట్టూ తిరగకుండా లోక్అదాలత్ వేదికగా రాజీమార్గంలో ఒకే రోజులో కేసుల నుంచి ఉపసమనం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ మెంబరు రమణారెడ్డి, న్యాయవాదులు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

## హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడు అరెస్టు

కలకడ మార్చి 8 ప్రభాతవార్త :

వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై రామాంజనేయులు తెలిపారు.స్థానిక పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఎర్రకోటపల్లి పంచాయతీ గొల్లపల్లి కు చెందిన సుధాకర్ ఈనెల ఏడవ తేదీన మూత్ర విసర్జనకు వెళ్లి వస్తున్న సమయంలో, అదే గ్రామానికి చెందిన వేమ నారాయణ తాను తీసుకొచ్చిన పెట్రోలను సుధాకర్ పై పోసి నిప్పు అంటించినట్లు తెలిపారు.వీరికి గతంలో భూతగాదాలు ఉన్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు.ఈ నేపథ్యంలో సుధాకర్ పై వేమ నారాయణ పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు తెలిపారు.సుధాకర్ కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్నవారు వచ్చి అతని కాపాడి ప్రైవేట్ వాహనంలో పీలేరు తరలించి, అక్కడ నుండి తిరుపతి రుయా వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతి పట్టణంలోని నారాయణాద్రి వైద్యశాలకు తరలించి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. క్షతగాత్రుడు సుధాకర్ స్టేట్మెంట్ మేరకు కేసు నమోదు చేసిన విషయం పాఠకులకు తెలిసిందే.ఈ క్రమంలో శనివారం నిందితుడైన వేమనారాయణను కోనక్రాస్ వద్ద పట్టుకుని అరెస్టు చేసి వాల్మీకిపురం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు. నిందితున్ని పట్టుకున్న వారిలో ఎస్సై తో పాటు హెడ్ కానిస్టేబుళ్ల హరిబాబు, రమేష్ బాబు, పోలీసులు కరుణాకర, రమేష్, రియాజ్ భాష, డ్రైవర్ రమేష్ బాబు, తదితరులు ఉన్నట్లు తెలిపారు.

## మహిళలు ప్రతి అవకాశాన్ని విజయంగా మలచుకోవాలి

చాపాడు, మార్చి 8, ప్రభాత వార్త.

నేటి సమాజంలో ప్రతి మహిళ అంది వచ్చిన అవకాశాన్ని విజయంగా మలుచుకోవాలని ఎస్సై, కే. చిన్న పెద్దయ్య తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులచే ర్యాలీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ వచ్చిన అవకాశాన్ని ఆత్మస్థైర్యం,మనోబలం, పట్టుదలతో విజయవంతంగా మలచుకోవాలని సూచించారు. ప్రతి మహిళ ప్రతి బాలిక సమాన హక్కులు, సమానత్వం సాధికారత సాధించే దిశగా పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ ఐ నాగేంద్రప్రసాద్, కానిస్టేబుల్స్ మధుసూదన్ రెడ్డి, ఉమామహేశ్వర్, కస్తూర్బా పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



## మండలాన్ని అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

రామసముద్రం,మార్చి8, ప్రభాతవార్త



మండలంలో శనివారం ఎమ్మెల్యే షాజహాన్ బాషా పర్యటన చేశారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు విజయ్ కుమార్ గౌడ్ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. నా కార్యకర్తకు ఏకష్టం వచ్చినా ముందుంటానని ఎమ్మెల్యే షాజహాన్ బాష తెలిపారు. రామసముద్రం మదనపల్లె రోడ్డు విస్తరణను అతిత్వరగా ప్రారంభిస్తామన్నారు.మరియు హంద్రీనీవా జలాలు మండలానికి అతి త్వరలో వస్తాయని, రైతులు అధైర్య పడకుండా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలని,తాగునీటి సమస్యల లేకుండా చేస్తానన్నారు. మినిగోకులం షెడ్లు, ఫారంఫండ్ బిల్ లు త్వరగా పడుతున్నాయన్నారు. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు విజయ కుమార్ గౌడ్,కొండూరు నారాయణ రెడ్డి, ఆర్వి శ్రీనివాస్ గౌడ్, భరత్రెడ్డి ప్రదీప్‌రెడ్డి, రూపేష్ రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, జావెద్, రమేష్, వెంకటేష్, విశ్వనాధ్‌రెడ్డి, దాసర్లపల్లి నాగరాజు, అధికసంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ప్రభావతి



ముద్దనూరు, మార్చి 08, ప్రభాతవార్త:

పట్టణంలోని అంగన్వాడీ 1 కేంద్రం లో విధులు నిర్వహిస్తున్న ప్రభావతి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎన్నికవ్వడంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా శనివారం కడప ఐసిడిఎస్ కార్యాలయా ఆవరణలో ఐసిడిఎస్ పి.డి. చేతుల మీదగా ప్రశంసా పత్రాన్ని తీసుకున్నట్లు తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలి



వేంపల్లి, మార్చి 08, ప్రభాతవార్త :

అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలకు అవకాశాలు కల్పించాలని వేంపల్లి వికాస్ స్కూల్ వ్యవస్థాపకుడు షేక్ నజీర్ బాషా అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల మహిళా ఉపాధ్యాయులను శాలువతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు సాధికారత సాధించినప్పుడే ప్రపంచ అభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్య పడుతుందన్నారు. ఆర్థికంగా బలోపేతమైతే కుటుంబ వ్యవస్థ కూడా బలపడుతుందని అభిప్రాయపడ్డారు. మహిళలను ఒక తల్లిగా, అక్క చెల్లమ్మగా భావించినప్పుడే మహిళా సాధికారత సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ షేక్ రఫీయా, ఉపాధ్యాయినులు పద్మా, అశ్వాన, అబీదా తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో పలు కేసులు రాజీ

మదనపల్లి క్రైమ్, మార్చి 8 ప్రభాతవార్త.



జాతీయ లోక్ అదాలత్ లో పలుకేసులు రాజీ అయినట్లు రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల్ లీగల్ సర్వీస్ చైర్మన్ అబ్రహం తెలిపారు. శనివారం మదనపల్లి కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో 2023 జూలైలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదం సంబంధించిన కేసులో బాధితులకు ద న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ రూ. 97 లక్షలు చెల్లించారు. బాధితులకు చెందిన చెక్కులను న్యాయమూర్తికి అందజేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కేసులు రాజీ చేసుకోవడం శుభ పరిణామం అన్నారు. లోక్ అదాలత్ కక్షిదారులను సంతృప్తి పరిచేలా రాజీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ జడ్జ్ వెంకటేష్ నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటరమణారెడ్డి, కంపెనీ ప్రతినిధులు చంద్రశేఖర్, శివరాం, లీగల్ అడ్వైజర్ స్వర్ణలత, మదనపల్లి బ్రాంచ్ మేనేజర్ రాజేష్ పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



వేంపల్లి, మార్చి 08, ప్రభాతవార్త :

మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారత సాధించడమే అంతర్జాతీయ మహిళా దినోత్సవ లక్ష్యమని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్. తులసిరెడ్డి అన్నారు. శనివారం ఆ దినోత్సవాన్ని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శివమునెమ్మ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ స్వర్ణలత లను శాలువతో సత్కరించారు. అనంతరం తులసిరెడ్డి మాట్లాడుతూ భగవంతుడిని సృష్టిలో స్త్రీ, పురుషులు సమానమన్నారు. కాంగ్రెస్ మొదటి నుంచి మహిళా సాధికారతకు కృషి చేస్తుందన్నారు. విద్యా, ఉద్యోగాల్లో, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, ద్వాక్రా సంఘాలు, ఐసీడీఎస్ లను స్థాపించినట్లు తెలిపారు. అంగన్వాడీ, ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరారు. తులసిరెడ్డి సతీమణి అలివేలమ్మ, నాయకులు సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్, ఉత్తన్న, రాజా, బద్రి తదితరులు పాల్గొన్నారు.

## 150 కేసులు పరిష్కారం

తంబళ్లపల్లె మార్చి 8 ప్రభాతవార్త ః

తంబళ్లపల్లె జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జరిగిన జాతీయ మెగా లోక్ అదాలత్ లో 150 కేసులు పరిష్కారం జరిగాయి. ఉదయం తంబళ్లపల్లి సివిల్ కోర్టు ఇన్చార్జ్ శిరీష్ ఆధ్వర్యంలో జరిగిన లోక్ అదాలత్ లో ఇరువర్గాల ఆమోదంతో సిపి ఐపిఎస్ ఏడు కేసులు, ఓఎస్2,ఈపి1, ఎస్ పి సి అడ్మిషన్లు 140 కేసులను పరిష్కరించారు. కేసుల పరిష్కారం ద్వారా రూ 12,57,933 నగదు రికవరీ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శిరీష్ మాట్లాడుతూ సుదీర్ఘకాలం పెండింగ్ లో ఉన్న కేసులతో కక్షిదారులు ఇబ్బందులు ఎదుర్కొనే కన్నా రాజీమార్గంలో ఇరువర్గాలు మాట్లాడుకొని సమస్య పరిష్కరించు కోడానికి ఈ అదాలత్ వారిదిగా నిలిచినట్లు చెప్పారు. లోక్ అదాలత్ లో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జనార్దన్ రెడ్డి, న్యాయవాదులు, లోక్ అదాలత్ సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.




## విద్యార్థులు ఏకాగ్రతతో పరీక్షలు రాయాలి



విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ అందిస్తున్న దృశ్యం

పెద్దమండెం మార్చి 8 ప్రభాతవార్త

10వ తరగతి విద్యార్థులు ఏకాగ్రతతో పరీక్షలు రాసి విజయం సాధించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్ సునీత అన్నారు. శనివారం విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి గొర్ల ఉదయ్‌కుమార్ పరీక్షల సంబంధించి అట్ట, పెన్ను పెన్సిల్‌లో రబ్బరు జామెంట్రీ తదితర వాటిని ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఇదే పాఠశాలలో చదివి ఎన్నో ఉన్నత పదవులకు చేరుకున్నామని, మీరు కూడా ఏకాగ్రతతో పరీక్ష రాసి ఉన్నత ఆశయాలను నెరవేర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గంగాధర, బూత్‌లెవెల్ కన్వీనర్ పవన్‌కుమార్‌యాదవ్ మహేశ్వర తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రి ప్రాంగణంలో చెట్లు నాటిన వైద్యులు

పీలేరు మార్చి 8 ప్రభాతవార్త :



మొక్క నాటుతున్న వైద్యులు

ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి ప్రాంగణంలో వైద్యులు, సిబ్బంది మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. బిస్మిల్లా ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బోధి షావలి ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటడం సంతోషించేదగ్గ విషయమన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ఇంటికి ఒక మొక్క వంతున నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగవేణి, డాక్టర్ ఇందుమతి, షాహ్, వైద్య సిబ్బంది, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఇన్చార్జ్ మంత్రిని కలిసిన తెలుగుదేశం నాయకులు

సుండుపల్లి, మార్చి08, ప్రభాతవార్త:



తెలుగదేశం పార్టీ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా ఇన్చార్జి మంత్రి బిసి జనార్దన్‌రెడ్డిని కలిసి రాయచోటి నుండి సుండుపల్లి డబుల్ రోడ్డు త్వరగా పూర్తి చేయాలని విన్నవించడం జరిగింది. మంత్రి స్పందించి సంబంధిత అధికారులను రోడ్డుపని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించడం జరిగిందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివరాంనాయుడు, మాజీ ఎంపిటిసి మోహన్‌బాబునాయుడు, సోమిశెట్టి మస్తాన్‌బాబు, సురేష్‌నాయుడు, ఆర్‌అండ్‌బి సంబంధిత అధికారి ఈఈ పాల్గొనడం జరిగింది.

## ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

ముద్దనూరు, మార్చి 08, ప్రభాతవార్త:



అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని శనివారం పోలీసు స్టేషన్ నందు సిఐ దస్తగిరి మరియు ఎస్ఐ మొయినుద్దీన్‌లు స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా సిబ్బంది మరియు మహిళా పోలీసుల చేత కేకు కటింగ్ చేయించారు. సిఐ మాట్లాడుతూ ఇంటి పనులను ఇంటిల్లిపాది అందరూ కలిసిమెలసి పంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, మహిళలను కుటుంబ సభ్యులందరూ సమానత్వంతో చూడాలని ఆయన సూచించారు. మహిళలకు చట్టం గురించి అవగాహన తక్కువగా ఉండడం చేతనే ఎక్కువగా నష్టపోతున్నారని, న్యాయ సేవలను వినియోగించుకునేలా మహిళా పోలీసులు చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యశోదా,వాణి, అనురాధ,ఆకాంక్ష, శివజ్యోతి, మర్దమ్మ మరియు కల్యాణిలు పాల్గొన్నారు.

## ఆర్‌అండ్‌ఏసి టెక్నీషియన్స్ సమస్యలను పరిష్కరించండి

కడప కార్పొరేషన్ మార్చి 8 ప్రభాతవార్త:




రిఫ్రిజిరేషన్ టెక్నిషన్ కార్మికుల సమస్యలపైన, వారు పడుతున్న ఇబ్బందుల గురించి కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించడం సంతోషమని రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ టెక్నీషియన్ వెల్ఫేర్ అసోసియేషన్ (రాక్వా) కడప నగర అధ్యక్షుడు లెక్కల మురళీమోహన్ రెడ్డి అన్నారు. శనివారం మాట్లాడుతూ ఆర్‌అండ్‌ఏసి టెక్నీషియన్స్‌కు లేబర్ డిపార్ట్మెంట్‌లోని భవన నిర్మాణ కార్మికుల దాంట్లో ప్రత్యేక విభాగం కావాలని కోరారు. శుక్రవారం అసెంబ్లీలో కడప ఎమ్మెల్యే మాధవ రెడ్డి అసెంబ్లీలో టెక్నీషియన్స్ సమస్యల గురించి చర్చించడం పై ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాక్వా సెక్రటరీ అక్రమ్ రషీద్, ట్రెజరర్ సయ్యద్ మైనుద్దీన్, కమిటీ మెంబర్స్ అశ్విన్, ప్రభాకర్ రెడ్డి, షరీఫ్, రాఘవ, సుబ్బు, ఆరిఫ్, మునవర్, రహమతుల్లా పాల్గొన్నారు.

## మహిళా ఉపాధ్యాయులకు ఘన సన్మానం

రాజంపేట అర్బన్, మార్చి8 ప్రభాతవార్త



రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. శనివారం రాజంపేట ఎస్‌టియు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మన్నూరులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజు మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాలలో ముందున్నారని, మహిళలు ఆధునిక సమాజంలో కీలకమని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బోయనపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు భారతి, గర్ల్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయరాలు జయలక్ష్మి మాట్లాడుతూ ఎస్ టి యు ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు జరపడం అభినందనియమన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ కన్వీనర్ నర్సింహ, మండల అధ్యక్షులు నాగరాజు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఆర్థిక కార్యదర్శి శంకర్ నాయక్, సత్యనారాయణ, ఓబులేసు, మోహనరావు, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, పెంచలయ్య, గంగాధర్, అన్నపూర్ణ, మదాలస, ఆదిలక్ష్మి, సుధారాణి, శశికళ, మాధురి, విజయలక్ష్మి, కళ్యాణి, హేమలత, స్వాతి, ప్రసన్న పాల్గొన్నారు.

## నేడు నుంచి సిగిరేశ్వర స్వామి ఉత్సవాలు

రామసముద్రం మార్చి 8 ప్రభాతవార్త

కురబల ఆరాధ్య దైవమైన శ్రీ సిగేరేశ్వర స్వామి, శ్రీ భత్తేశ్వర స్వామి, శ్రీ బీరేశ్వర స్వామి, శ్రీ ఉజ్జనేశ్వర స్వామి ఆలయంలో జరిగే ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీటీసీ రెడ్డప్ప విన్నవించారు. ఈ మేరకు మదనపల్లెలో ఈ దేవరలను విజయవంతం చేయాలని కోరుతూ రెడ్డప్ప విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రామసముద్రం మండలం, పెద్దకురప్పల్లె పంచాయతీ, మట్లవారిపల్లిలో వెలసి ఉన్న శ్రీ సిగేరేశ్వర స్వామి ఆలయంలో పూజ కార్యక్రమాలు నాలుగు రోజులపాటు వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. శనివారం గురుపూజ, ఎద్దు పూజ, రాత్రి 7 గంటలకు ప్రాకోత్సవం, 9న ఉదయం 9 గంటలకు కళ్యాణోత్సవం మధ్యాహ్నం 2 గంటలకు నుండి 4 గంటల వరకు భక్తాదుల తలపై టెంకాయ ప్రమాణము జరుగుతుందని చెప్పారు. రాత్రి 7 గంటలకు దీపారాధన నిర్వహించి దేవరలను ముగింపు చేయనున్నట్లు ఎంపీటీసీ రెడ్డప్ప పేర్కొన్నారు. ఆదివారం జరిగే ఈ మహా ఉత్సవానికి వేలాదిగా తరలిరావాలని కోరారు.

# మహిళలను లక్షాధికారులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం



రాయచోటి, మార్చి 08 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహిళా సాధికారత ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు వల్లనే సాధ్యమైందని అన్నమయ్య జిల్లా ఇన్చార్జి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాయచోటి నగరంలోని నారాయణ ఫంక్షన్ హాల్ లో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు బీసీ జనార్దన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, టిడిపి నాయకులు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, జగన్మోహన్రాజు, జయచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళలకు ఇచ్చిన ప్రాధాన్యతల వల్లే ఆంధ్రప్రదేశ్లో మహిళా సాధికారత సాధ్యమైందని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన డ్వాక్రా గ్రూపుల వల్ల ఎంతోమంది మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించగలిగారన్నారు. బడ్జెట్ 2025 26 సంవత్సరానికి మహిళ సాధికారతకు పెద్దపీట వేస్తూ నాలుగువేలు ఎనిమిది వందల కోట్లకు పైగా బడ్జెట్ కేటాయించారన్నారు. అమెజాన్ ఫ్లిప్కార్ట్ వంటి డిజిటల్ కామర్స్ ఉన్న ప్రస్తుత ప్రపంచంలో మహిళల ద్వారా ఉత్పత్తి అవుతున్న వస్తువులకు డిమాండ్ ఉందంటే అది అన్నమయ్య జిల్లా మహిళల ప్రత్యేకత. ఇటువంటి ఎన్నో ఘనతలు సాధించిన అన్నమయ్య జిల్లా ఇన్చార్జి మంత్రిగా ఉన్నందుకు ఎంతో గర్విస్తున్నట్లుగా పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రతి జిల్లాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుతున్నామన్నారు. మదనపల్లికు చెందిన భవానిని స్ఫూర్తిగా తీసుకొని మహిళలందరూ ఆర్థిక, సామాజిక అభివృద్ధి పొందాలని సూచించారు. జిల్లాలో లక్షాధికారులుగా మారిన మహిళలను సత్కరించుకోవడం ఆనందదాయకమన్నారు. మహిళలను లక్షాధికారులుగా తీర్చిదిద్ది వారి ద్వారా మరింత మందికి స్ఫూర్తినిచ్చి జిల్లా వ్యాప్తంగా మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. మెప్మా ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న 109 మందితో కూడిన ఎస్హెచ్జి గ్రూపులకు 17 కోట్ల రూపాయల రుణాలను అందిస్తున్నట్లుగా పేర్కొన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో పీఎం విశ్వకర్మ కార్యక్రమం ద్వారా 87 మంది మహిళలకు 86 లక్షల రూపాయల రుణాలను అందిస్తున్నట్లుగా పేర్కొన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో పీఎం ఈజీపి కార్యక్రమంలో భాగంగా రెండు కోట్ల రూపాయల రుణాలను మహిళలకు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ మహిళలు కేవలం కుటుంబ పోషణలోనే కాకుండా దేశ ఆర్థిక అభివృద్ధికి ఎంతో పాటు పడుతున్నారని వారి భద్రత చాలా ముఖ్యమని పేర్కొన్నారు. మహిళల భద్రత కోసం శక్తి మొబైల్ యాప్ ను ఈరోజు ప్రారంభించినట్లుగా పేర్కొన్నారు. ఈ యాప్ ఉపయోగించుకుని మహిళలకు ఎటువంటి అభద్రత ఎదురైన కేవలం ఒక బటన్ నొక్కితే పోలీసులకు సమాచారం వెళుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని అన్ని పాఠశాలలో సంక్షేమ హాస్టళ్లకు ఒక పోలీసును ఏర్పాటు చేస్తామని ఆ పోలీస్కు ఎటువంటి సమాచారం అయినా తెలుపవచ్చని పేర్కొన్నారు. టిడిపి నాయకులు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు వల్లనే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ సాధ్యమైందని, టిడిపి ప్రభుత్వం అన్ని రకాలుగా మహిళలకు చేయూతనిస్తోందని పేర్కొన్నారు. రాజంపేట టిడిపి పార్టీ నాయకుడు జగన్ మోహన్ రాజు మాట్లాడుతూ మహిళలకు ఆస్తిలో హక్కు ఇచ్చే చట్టాన్ని ఎన్టీ రామారావు తీసుకువచ్చి మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి చేశారన్నారు. మదనపల్లికు చెందిన భవాని మాట్లాడుతూ ఒకప్పుడు డ్రాప్ అవుట్గా ఉన్న తనకు జిల్లా శ్రీ మరియు శిశు సంక్షేమ శాఖ వారు ఎంతో సహకారం అందించారని, తాను ప్రస్తుతం అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టుమాస్టర్ గా పనిచేస్తున్నానని, తనను స్ఫూర్తిగా తీసుకొని మహిళలు అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. అనంతరం జిల్లాలో వివిధ శాఖలకు చెందిన ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు, లక్షాధికారులుగా మారిన మహిళలకు శాలువా మరియు మొమెంటులతో సత్కరించారు.

# వైభవంగా కోదండ రామాలయంలో మహా శాంతి అభిషేకం





ఒంటిమిట్ట మార్చి 8 ప్రభాతవార్త

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో నాలుగవ రోజైన శనివారం మహా శాంతి అభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 6 గంటలకు చతుస్థానార్చనము, శ్రీమద్రామాయణ యజ్ఞం, మూర్తి హోమం, సహస్రకలశాది దేవత హోమం, సహస్ర కలశాభిషేకం, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు కళాపకర్షణ, శయ్యాదివాసం, ప్రధాన మూర్తి హోమం, తత్వన్యాస హోమములు, వేదాది పారాయణం, అష్టబంధన సమర్పణ, శాంతి హోమం, పూర్ణాహుతి, మహా శాంతి అభిషేకం జరిగింది. మార్చి 9 ఆదివారం భగవత్పుణ్యాహం, మూర్తి హోమం, శ్రీ మద్రామాయణ హోమం, పంచసూక్త పవమాన హోమములు నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 9:30 గంటలకు మహా పూర్ణాహుతి, ఉదయం 10.15 నుండి 11:30 గంటల వరకు వృషభ లగ్నంలో మహా సంప్రోక్షణ మరియు మహా కుంభాభిషేకము, స్వర్ణ పుష్పార్చన శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. అనంతరం భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో శ్రీ నటేష్ బాబు, సూపరింటెండెంట్ శ్రీ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ నవీన్, ఇతర అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

**నేడు ఒంటిమిట్టకు టిటిడి చైర్మన్ రాక**

ఆదివారం ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామాలయానికి టిటిడి చైర్మన్ బి.ఆర్ నాయుడు కోదండ రామాలయంలో ఆదివారం జరిగే మహా సంప్రోక్షణ కుంభాభిషేకం కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు అనంతరం ఏప్రిల్ 11వ తేదీన జరిగే సీతారాముల కల్యాణోత్సవం పై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు.

# భూసమస్యలను పరిష్కరిస్తాం



పులివెందుల, మార్చి8,ప్రభాతవార్త:

ముస్లింలకు అండగా ఉంటాం తెలుగుదేశం పార్టీ వుంటుంది అని గతంలో ముస్లింలకు ఇచ్చిన భూములను సర్వే చేసి వారి హద్దులు వారికి ఉండేలా చేస్తామనీ ,ముస్లిం సోదరుల ఇనామ్ భూసమస్యలను పరిష్కారం చేసి వారికి న్యాయం చేస్తానని పులివెందులనియోజక వర్గ తెదేపా ఇన్చార్జి మారెడ్డి రవీంద్ర నాథ్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద ముస్లిం సోదరుల భూ సమస్యలు పరిష్కరించమని వినతి పత్రం అందించిన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ గతంలో ముస్లిం లకు భూములు ఇవ్వడం జరిగింది అని ఆ భూములను కొందరు ఆక్రమించారు అని ఆ భూములను సర్వే చేసి వారి హద్దులు వారికి ఉండేలా చేస్తాం అన్నారు. మున్సిపాలిటీ ముస్లిం సోదరులు మసీదులు దూరం ఉండటం వల్ల నమాజ్ కి వెళ్లడానికి ఇబ్బందిగా ఉందని మా దృష్టికి తెచ్చారు అని కావున మున్సిపాలిటీలో అవకాశం వున్న ప్రతి ప్రాంతంలో కొత్త మసీదుల నిర్మాణానికి ప్రభుత్వం తరపున సహాయం అందించేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మహబూబ్ భాషా,మరియు ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# గిరీష్ కుమార్ సంఘీ సేవలు అభినందనీయం



బద్వేలు అర్బన్, మార్చి 08 ప్రభాతవార్త :

వార్త జాతీయదినపత్రిక సిఎండి, మాజీ రాజ్యసభ సభ్యులు డా॥ సంఘీ జన్మదిన వేడుకలు శనివారం బద్వేలు పట్టణంలోని ఆనంద నిలయం నిరాశ్రయుల వసతి గృహంలో వార్త బద్వేలు సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ముందుగా ప్రత్యేక కేక్ కట్ చేయించి పలువురు అనాథ వృద్ధులకు పండ్లు, స్వీట్లు అందజేశారు. ప్రతి సంవత్సరం గిరిష్ సంఘీ పుట్టిన రోజు నాడు మహిళలను సత్కరించడం అభినందనీయమని, ఆయన ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని పలువురు ఆకాంక్షించారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం

కలికిరి, మార్చి 8, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మహేశ్వరీభాయ్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి మహిలా ఉద్యోగులు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు గౌరీ, శిల్పకుమారి, ఆదిలక్ష్మి, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.



# మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలి



బద్వేలు ,మార్చి 8 ప్రభాతవార్త

మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలనీ డీఎస్పీ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బద్వేల్ పట్టణంలో బద్వేల్, గోపవరం పోలీస్ శాఖలు, జడ్పీ పాఠశాల విద్యార్థినులు, ఆశా వర్కర్లు మరియు డ్వాక్రా సంఘాలు, మహిళలచే భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు డిఎస్పి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మహిళలు మనోధైర్యంతో ముందుకు సాగాలని ,ఏ శక్తి మిమ్మల్ని అడ్డుకోలేదని ఇప్పటికే పురుషులతో సమాన హక్కులు సాధించారని, మహిళను పూజించిన చోటే జాతి గౌరవంగా ఉంటుందని ఆయన సూచించారు. స్త్రీ ,పురుషుల మధ్య విభేదాలు తొలగి సామాజిక సుస్థిర అభివృద్ధి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సిఐ రాజగోపాల్, రూరల్ సీఐ నాగభూషణం, జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి లు పాల్గొని మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని వారు అన్నారు. మహిళ సాధికారతే లక్ష్యంగా వారు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

# వడదెబ్బపై విద్యార్థులకు అవగాహన

కలికిరి, మార్చి 8, ప్రభాతవార్త:

కలికిరిలో జిల్లా వవైద్య ఆరోగ్యశాఖాధికారి ఆదేశాల మేరకు వడదెబ్బపై విద్యార్థులకు కలికిరి పట్టణంలో గల ఇంటిగ్రేట్ హాస్టల్ విద్యార్థులకు హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహ్మద్ రఫీ మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభం అయినందున ఎండలు క్రమేపీ పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఒంటిపూట బదులు ప్రభుత్వం ప్రవేశపెడుతున్నారన్నారు. మధ్యాహ్న సమయంలో విద్యార్థులు బయటికి వెళ్లకుండా హాస్టల్ లోపలే ఉండి హోం వర్కు చేసుకోవడం, చదువుకోవడం లేదా నిద్రపోవడం చేయాలన్నారు. ఎండలో క్రికెట్, కబాడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటి ఆటలు ఆడటం వల్ల ఎండ దెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఎక్కువగా జ్వరం, తలనొప్పి, నీరసం, కళ్ల తిరగడం, విరోచనాలు, వాంతులు, నోరు ఆరిపోవుట, అపస్మారక స్థితిలోకి వెళ్లడం, కలవరింతలు వంటి లక్షణాలు ఉంటాయన్నారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే చల్లటి నీడ ప్రదేశం లోకి తీసుకెళ్లాలని, ఓఆర్ఎస్ ద్రావణం తాగించాలన్నారు. ముఖాన్ని చల్లటి నీటితో తుడిచి ఫ్యాన్ కింద ఉంచాలన్నారు. అనంతరం ఆసుపత్రికి తరలించాలన్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 వరకు బయటికి అత్యవసరం అయితే తప్ప రాకూడదన్నారు. గంట గంటకు నీరు ఒక గ్లాసు తాగాలని ఇంటిలో కిటికీలు తెరుచుకొని ఉండాలన్నారు. నల్లని బట్టలు వేయరాదన్నారు. గర్భవతులు, బాలింతలు, 10 సంవత్సరాల లోపు పిల్లలు, 60 సంవత్సరాలపైబడిన వారు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.



# అంతర్జాతీయ మహిళా దినోత్సవం



కడప మార్చి 8 ప్రభాతవార్త

స్థానిక కెయస్ఆర్ఎం ఇంజనీరింగ్ కాలేజీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కడప నగరంలోని ఎస్ కేఆర్ అండ్ఎస్కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆర్థికశాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తున్న విజయ లక్ష్మి మాట్లాడుతు మహిళలు దేనిలోనూ తక్కువ కాదంటూ లింగ సమానత్వాన్ని తెలియజేస్తూ విజయాలు సాధిస్తున్నారు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం కెఎల్ఎం కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నమ్మ మాట్లాడుతూ మహిళలూ ఆత్మవిశ్వాసంతో సాధించలేనిది ఏదీ లేదన్నారు. కెయస్ఆర్ఎం వైస్ప్రిన్సిపాల్ టీఎన్ ప్రసాద్ మాట్లాడుతూ మహిళలు, బాలికల హక్కులు, సమానత్వం, సాధికారతపై ఆధారపడి ఉంటుంది, అంతే కాదు ఇది మహిళల జీవితాలను మెరుగుపరచడానికి, వేగవంతమైన పురోగతికి, మహిళలకు సాధికారత కల్పించడానికి, సమాన అవకాశాలను ,మహిళల హక్కులు, సమానత్వం గురించి అవగాహన పెంచడం గురించి ప్రసంగించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వివిఎస్ మూర్తి, కరస్పాండెంట్ శ్రీమతి కందుల రాజేశ్వరమ్మ, ఉమెన్ ఎంపవర్మెంట్, ఉమెన్ ప్రొటెక్షన్, జెండర్ ఈక్వాలిటీ, స్టూడెంట్ ఆక్టివిటీ కౌన్సిల్, ఉమెన్ ఫ్యాకల్టీ, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

## ఎమ్మెల్యే షాజహాన్బాషా



మహిళలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె, మార్చి 8 ప్రభాతవార్త :

మహిళలు అన్ని రంగాల్లో రాణించినపుడే సమాజాభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే షాజహాన్బాషా తెలిపారు. శనివారం ఎమ్మెల్యే నివాసం వద్ద అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్మిక మహిళలకు, దివ్యాంగులకు శాలువలు కప్పి ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడుతూ పురుషులకు సమానంగా మహిళలు ఆర్థికంగా రాణించాలన్నారు. మహిళ ఆర్థికంగా ఉన్నప్పుడే కుటుంబం అంతా అన్ని రంగాలుగా బాగుంటుందన్నారు. విద్యలో కూడా మహిళలు ముందుంజులో ఉండాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మహిళా అభ్యున్నతికి పెద్ద పీట వేస్తున్నారన్నారు. రాజకీయంగా కూడా మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం త్వరలోనే ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే మహిళలకు దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వడం జరుగుతోందన్నారు. అనంతరం మహిళలందరికి శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ప్రమీల, జనసేన నాయకురాలు దారం అనత, కౌన్సిలర్ తులసీ, మహిళా నాయకురాలు నాగమణి, పులిమహాలక్ష్మి, భారతి, జయమ్మ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యే నివాసం వద్ద శనివారం ఉదయం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించి పరిష్కారానికి అధికారులను ఆదేశించారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం



బద్వేల్ అర్బన్, మార్చి 8, ప్రభాతవార్త

బద్వేల్ పట్టణంలోని పోరుమామిళ్ల రోడ్డులో గల సరస్వతి శిశు మందిర్ లో బిజెపి బద్వేల్ పట్టణ శాఖ అధ్యక్షులు ధర్మిశెట్టి వెంకట సుబ్బయ్య రాయల్ ఆధ్వర్యంలో మార్చి 8 అంతర్జాతీయ మహిళ దినోత్సవం కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. పార్లమెంట్లో ప్రత్యేకంగా మహిళలకు 33 రిజర్వేషన్లు కూడా కేటాయిస్తూ ఇటీవల బిల్లు ఆమోదం తెలపడం జరిగింది. ఇలా ప్రతి కార్యక్రమంలో మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న పార్టీ భారతీయ జనతా పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కుప్పాల నరసింహులు, ఆర్ఎస్ఎస్ నాయకులు రామకోటి రాజు , బిజెపి పట్టణ ఉపాధ్యక్షురాలు కటారు కిరణ్ కుమార్, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# దుష్ప్రచారంలో ఆరి తేరిన ఎల్లో మీడియా

## అనారోగ్యంతోనే అభిషేక్ రెడ్డి మృతి

## అభిషేక్ మృతి మాకు తీరని లోటు

## వైఎస్ మదనమోహనరెడ్డి

పులివెందుల,మార్చి8,ప్రభాత వార్త:



ఒక అబద్ధాన్ని పదే పదే చెబుతూ అదే నిజమని ప్రజలు నమ్మించాలని కొన్ని మీడియా సంస్థలు శక్తి వంచన లేకుండా పని చేస్తోంది. అనారోగ్యంతో మా కుమారుడు వైఎస్ అభిషేక్ రెడ్డి చనిపోయారు అని శక్తివంచన లేకుండా వైద్యులు ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించిన దేవుడు చిన్నచూపు చూడడంతో మృతి చెందారన్నారు. చిన్న వయస్సులో ఎంతో భవిష్యత్ ఇన్న వైఎస్ అభిషేక్ రెడ్డి చనిపోయారని మా ప్రాంతంలో ప్రతి ఒక్కడు తీవ్రంగా మదనపడ్డారు.మా కుటుంబా నికి వైఎస్ అభిషేక్రెడ్డి చనిపోవడం తీరనిలోటు అని అన్నారు. ఇలాంటి పరిస్థితులలో మేమంటి చిన్నాన్న వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సాక్షులు ఒక్కొక్కరుగా అర్ధాంతరంగా చనిపోతున్నారని, అందులో కుట్ర దాగిందని ఇష్టానుసారం కథనాలు రావడం బాధాకరం అన్నారు.మా మామ డాక్టర్ ఈసీ గంగిరెడ్డి కరోనా వైరస్తో ఉనిపోయారనీ మొన్న వాచ్మెన్ రంగన్న చనిపోయాడు. రంగన్న ఆయాసం ఉందని కుటుంబ సభ్యులు చెబుతున్న విషయం అందరికి తెలుసు అని సహజ మరణాలను అసహజ మరణాలుగా చిత్రీకరించేందు కు ఒక పథకం ప్రకారం కొన్ని మీడియా సంస్థలు పని చేస్తున్నాయి అన్నారు. బయటి ప్రపంచానికి పులివెందులలో దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారని తెలియజెప్పేందుకు విశ్వయత్నం చేస్తోంది. వారి దుష్ప్రచారానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ పెద్దల చర్యలున్నాయన్నారు.రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే జ్యూడిషియల్ దర్యాప్తుకు ఆదేశించాలన్నారు.చిన్నాన్న వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సాక్షులుగా ఉన్నవారు మృతి చెందిన వ్యవహారంపై సిట్ దర్యాప్తు అంటేనే ఏదో కుట్రదాగి ఉందని అనుమానం వస్తోందినీ సిట్ కాదు, బ్యాడిషియల్ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.ప్రభుత్వం నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయిస్తే ఎవ్వరికి ఎలాంటి అభ్యంతర లేదనీ కూటమి ప్రభుత్వం పెడుతోన్ని అడ్డగోలు కేసులు చేపట్టుతోన్న ఏకపక్ష విచారణ కళ్లారా అందరం చూస్తున్నా మన్నారు.కాబట్టి జ్యూడిసియల్ విదారణ కోరుతున్నా అన్నారు.

# స్వశక్తితో కృషి చేస్తేనే సాధ్యం



ప్రొద్దుటూరు మార్చి 8 ప్రభాతవార్త

మహిళలు సమాజంలో ఎదగడానికి స్వశక్తితో కృషి చేయాలని జమ్మలవమడుగు ఆర్డిఓ ఆదిమూలం సాయి శ్రీ పేర్కొన్నారు. శనివారం ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక పిఎన్ఆర్ ఫంక్షన్హాల్లో పోలీస్, సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ, వికసిత ఫౌండేషన్, ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు స్వయంగా ఎదగడం ద్వారా సమాజంలో ఒక గుర్తింపు ఏర్పడుతుందని వివరించారు. డిఎస్పీ భావన మాట్లాడుతూ స్త్రీలు సమాజంలో మంచి గుర్తింపు సాధించడానికి చదువు ఒక విలువైన అస్త్రంగా వినియోగించుకోవాలని తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ స్టేట్ టాక్స్ స్ షేక్ సుమయ మాట్లాడుతూ సమాజంలో మహిళల పై జరుగుతున్న దాడుల పైన ప్రతి ఒక్కరు స్పందించి మార్పు వచ్చే విధంగా కృషి చేయవలసిన అవసరం ఉందన్నారు. ట్రైనీ డిఎస్పి భవాని మాట్లాడుతూ సమాజంలో లింగ భేదాలు లేకుండా ఆడపిల్లలను పెంచినప్పుడు సరైన మహిళా సమాజం ఏర్పడుతుందన్నారు. అనంతరం వివిధ సామాజిక, సేవా రంగాలలో విశిష్ట సేవలు అందించిన పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి, వికసిత ఫౌండేషన్ చైర్మన్ శూలం లక్ష్మీదేవి సెక్రటరీ శూలం ప్రసాద్, సావిత్రి నెహ్రూ యువ కేంద్రా సభ్యులు భారతి రజియా రవి డాన్సర్ మహి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

## జిల్లా మూడవ అదనపు న్యాయమూర్తి ప్రవీణ్ కుమార్





రాజంపేట న్యాయమూర్తి కె.భార్గవిని సన్మానిస్తున్న మహిళా న్యాయవాదులు

రాజంపేట అర్బన్, మార్చి 8 ప్రభాతవార్త

మహిళలు అన్ని రంగాలలో రాణించాలని రాజంపేట జిల్లా మూడవ అదనపు న్యాయమూర్తి ప్రవీణ్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం న్యాయమూర్తి ప్రవీణకుమార్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. దేశ చరిత్రలో మహిళల గొప్పతనము గురించి వివరించారు. సన్మానం అందుకున్న రాజంపేట జూనియర్ సివిల్ జడ్జి కె.భార్గవి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశములో సీనియర్ సివిల్ జడ్జి కేశవ, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ పి.శంకర్ ,ఏ పి పి రసూల్ రెహానా,ఏ జి పి మోనిక ,మహిళా న్యాయవాదులు సులోచన, సాయిప్రశాంతి, సరిత ఆశా ప్రియా బార్ ప్రెసిడెంట్ నాసరుద్దీన్, మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సీనియర్ న్యాయవాదులు కృష్ణకుమార్, హనుమంతునాయుడు, ఎస్బిఐ మేనేజర్ పుష్పలత, తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమములో న్యాయవాదులు వెంకటసుబ్బయ్య కాశీ, శ్రీనివాసులు, పాపయ్య, కోర్టు సిబ్బంది చెంద్రాయుడు, ప్రసాద్, రమణ, చంద్రమోళి, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

# మహిళ సాధికారతకు కృషి చేసిన రేణుకకు సన్మానం



మదనపల్లెక్రైమ్, మార్చి 8 ప్రభాతవార్త.

సాయి డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకురాలు రేణుక అలియాస్ చిట్టి కి జిల్లాస్థాయి అవార్డు ప్రధానం చేశారు. శనివారం అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇన్చార్జి మంత్రి జనార్దన్, జిల్లా కలెక్టర్ చామకుర్తి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ల చేతుల మీదుగా రేణుక కు అవార్డు ప్రధానం చేశారు. మహిళా సాధికారతకు కృషి చేసిన పలువురు మహిళలను సత్కరించారు. ఈ సందర్భంగా సాయి డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకురాలు రేణుక అలియాస్ చిట్టికి ప్రత్యేకంగా సన్మానం జరిగింది. మహిళలకు డ్రైవింగ్ శిక్షణ ఇవ్వడంతో పాటు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా మహిళా సాధికారతకు ఆమె చేసిన కృషిని గుర్తించి ఈ పురస్కారాన్ని అందించారు. రేణుక మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించగలరు. ఆర్థిక స్వావలంబన సాధించడం ద్వారా వారు మరింత శక్తిమంతులు కాగలరు. డ్రైవింగ్ శిక్షణ ద్వారా మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికే నా వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందని, మహిళలు దీన్ని సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలన్నారు. రేణుక కు అవార్డు రావడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

# స్వశక్తి, వృత్తినైపుణ్యాలుంటే సవాళ్లను ఎదుర్కొనవచ్చు





ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పి

కురబలకోట, మార్చి 8 ప్రభాతవార్త :

మహిళలు స్వశక్తి, వృత్తి నైపుణ్యాలుంటే ఎలాంటి సవాళ్ళనైనా ఎదుర్కొనవచ్చునని అన్నమయ్యజిల్లా ఎస్పి వి.విద్యాసాగర్నాయుడు అన్నారు. మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పి, కళాశాల ప్రిన్సిపాల్, ఆర్ఆర్ అకాదమి చైర్మెన్ నాదేళ్ళ ద్వారకనాథ్లు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ భవిష్యత్తులో బంగారు బాటలు వేయాలంటే తల్లిదండ్రులు, గురువుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. మహిళల్లో స్వశక్తి, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ఇది విజయానికి దోహదపడుతుందన్నారు. వృత్తి నైపుణ్యం ఉంటే మనం చేస్తున్న పనిలో నైపుణ్యం కలిగి ఎలాంటి సవాళ్ళు అయిన సులభంగా ఎదుర్కొని సమస్యలకు పరిష్కారం కనుగొనవచ్చునని తెలిపారు. విద్యార్థినిలు, మహిళలు, ఎవరికైనా ఎటువంటి సమస్య వచ్చినా పోలీసులను సంప్రదించేందుకు వెనుకాడకూడదని ఎస్పి కోరారు. ఇప్పటికే అన్నమయ్య పోలీస్ వాట్సప్ చానల్స్ను ప్రారంభించామని తెలిపారు. అందులో అవగాహన కార్యక్రమాలు పోస్టు చేస్తున్నట్లు తెలిపారు. కళాశాల విద్యార్థులు పోలీస్ వాట్సప్ చానల్స్ ను ఫాలో కావాలని కోరారు. అనంతరం ఎస్పి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఆర్ఆర్ అకాదమి చైర్మెన్ నాదేళ్ళ ద్వారకనాథ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్, మదనపల్లె డిఎస్పి కొండయ్య నాయుడు, రూరల్ సిఐ సత్యనారాయణ, ముదివేడు ఎస్ఐ దిలీఫ్కుమార్, కళాశాల సిబ్బంది, విద్యార్థినిలు, పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.